www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 42 శుక్రవారం, జూన్ 26, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు
# బీమా భరోసా

### ఒక్క రూపాయి భారం లేకుండా రూ. కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా

● అదనంగా పనిచేయండి..ఆదాయం పెంచండి... ● పన్ను కట్టని అక్రమార్కులను కట్టడి చేయాలి ● రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళ్తున్నా : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ● ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాదబీమా ● 16 బ్యాంకులతో ప్రభుత్వం ఒప్పందం ● కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులకూ వర్తింపు



హైదరాబాద్,జూన్ 25 : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఒకగంట అదనంగా పనిచేసి ఆదాయాన్ని పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. పన్నులు కట్టకుండా ఉండే అక్రమార్కులను కట్టడి చేస్తే ఆదాయం పెరుగుతుందని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పించేందుకు అవగాహన ఒప్పందం కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 బ్యాంకులు ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రమాదబీమాను కల్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, ఉద్యోగులు ఒక్క రూపాయి చెల్లించకుండా రూ.కోటి ప్రమాద బీమా ఎలా సాధ్యమని అనిపించిందని చెప్పారు. కానీ ప్రమాదవశాత్తు మరణించిన 45 మంది సింగరేణి కార్మికుల కుటుంబాలకు రూ.కోటి బీమా సొమ్మును అందించిన తర్వాత ఇది సాధ్యమని నిరూపితమైందని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ బీమాను అమలు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. ఈ ప్రమాద బీమా ఉద్యోగుల కుటుంబాలకు ఒక ధైర్యాన్ని, భరోసాను మిగతా2లో...

## జల వివాదాలను
# పరిష్కరించుకుందాం

### -తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి

పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం

మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి

కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి

తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి

మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి





బళ్లారి,జూన్ 25 : తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా మిగతా2లో...

## సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

- ఇది రాజ్యాంగబద్ధ ప్రక్రియ మాత్రమే
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ



హైదరాబాద్,జూన్ 25 : రాజ్యాంగబద్ధమైన సర్ పక్రియను రాజకీయం చేయొద్దని మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'సర్ పక్రియ ఒక చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన పక్రియ మాత్రమేనని, మిగతా2లో...

## ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

- అభివృద్ధిని ఓర్వేలకపోతున్న బావాబామ్మర్దులు
- ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్



హైదరాబాద్,జూన్ 25 : ఇందిరా గాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీ లు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం మిగతా2లో...

## వెనిజులాలో
# భూ ప్రళయం

వెనిజులాను వణికించిన వరుస భూకంపాలు

39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు

నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు

ప్రాథమిక సమచారం మేరకు 32 మంది మృతి

దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు

అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్



కారకాస్,జూన్ 25 : వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా మిగతా2లో...



## బీసీ గురుకుల విద్యాసంస్థల
# బలోపేతం

ఐఐటీలు, ఎన్‌ఐటీలలో విద్యార్థులకు ట్యాప్‌టాప్‌లు

విద్యార్థి మరణిస్తే కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,జూన్ 25 : బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం, విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల

మిగతా2లో...



## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు

ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా...

వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..కార్యకర్తలకు కెటిఆర్ భరోసా

వికారాబాద్,జూన్ 25 : వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా.. అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని మిగతా2లో...

## ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశాం

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అప్పులు చేసి ఇస్తున్నాం

పదివేల కోట్లు నష్టం వచ్చినా పంటలు కొనుగోలు చేశాం

సిఎం సభావేదికను పరిశీలించిన మంత్రి తుమ్మల



2లో

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

● క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు ● జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు ● జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల ● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్,జూన్ 25 :పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ,

మిగతా2లో...

శుక్రవారం, జూన్ 26, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# వెనిజులాలో భూ ప్రళయం

(మొదటి పేజీ తరువాయి)

రాత్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగ్జ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనిజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కుప్పకూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

# రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తుందని చెప్పారు. ఉద్యోగుల భద్రత యజమానిగా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.తనను కొందరు గుంపుమేస్త్రీ అని అవహేళన చేస్తుంటారని అన్నారు. ‘అవును.. నేను... గుంపుమేస్త్రీనే...’ అని చెప్పారు. ఉద్యోగుల గుంపంతా తనదేనని, ఈ గుంపే తన బలం, ప్రతిష్ఠ అని వివరించారు. ఈ గుంపే పేదలకు, ప్రభుత్వానికి మధ్య వారధులని అన్నారు. హోదా, పదవి మారినా తాను ఎప్పటికీ రేవంతన్నగానే ఉంటానని చెప్పారు. పదవులు శాశ్వతం కాదని, ఈ అన్నదమ్ముల అనుబంధమే శాశ్వతంగా ఉంటుందని అన్నారు. అందరం కలిసి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుదామని కోరారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ పదేండ్లలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి దివాళా తీయించారని విమర్శించారు. పదేండ్లలో వందేండ్ల విధ్వంసం సృష్టించారని అన్నారు. కాంగ్రెస్ రాకముందు మొదటి తారీఖున జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదాఅని ప్రశ్నించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మొదటి తారీఖున ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామని చెప్పారు. చెప్పిన మాట ప్రకారం విడతల వారీగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన నిధులను విడుదల చేస్తున్నామని వివరించారు. ఇంకా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలనీ, చర్చించుకుని పరిష్కరించుకుందామని చెప్పారు. సంక్షేమ పథకాల అమల్లో ఉద్యోగుల కృషి ఉందన్నారు.రోజుకు ఒక గంట అదనంగా పనిచేసి రాష్ట్ర ఆదాయం పెంచితే ఉద్యోగుల అవసరాలను తీర్చడానికి వాటిని ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే అది ఉద్యోగుల చేతుల్లోనే ఉందని చెప్పారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైల్ విస్తరణ వంటి అభివృద్ధి పనులను చేయాలని అడ్డుకుంటామంటే కుదరదని ప్రతిపక్షాలను హెచ్చరించారు. కేసీఆర్ కుటుంబాన్ని చింతమడకకే పరిమితం చేస్తామన్నారు.ఈ ప్రభుత్వానికి ఉద్యోగులే బ్రాండ్ అంబాసిడర్లని కితాబిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, సీఎస్ కే.రామకృష్ణారావు, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఎమ్‌డీ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు సిక్తా పట్నాయక్, గౌరవ్ ఉప్పల్, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలు బ్యాంకులకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. **దేశ చరిత్రలోనే తొలిసారి : భట్టి** ప్రభుత్వ ఉద్యోగులకు తమ ‘ప్రజా ప్రభుత్వం’ బంపర్ ఆఫర్ ప్రకటించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒక్క రూపాయి భారం లేకుండా రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా, విమాన ప్రమాదమైతే రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు రక్షణ ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందికీ ఈ బీమా వర్తిస్తుందని వివరించారు. ఇలాంటి పథకాన్ని దేశచరిత్రలోనే తొలిసారిగా ప్రవేశపెట్టామని చెప్పారు. ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకే ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ పథకం కింద 18 నుంచి 60 ఏండ్ల వయస్సు గల ఉద్యోగులకు రూ.10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఉద్యోగులకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. వారికి త్వరలోనే నగదు రహిత వైద్యం అందిస్తామనీ, ఆరోగ్య కార్డులను అందజేస్తామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం సమష్టిగా, చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. **ప్రభుత్వానికి కృతజ్ఞతలు :** ఉద్యోగ జేఏసీ ఉచిత ప్రమాద బీమాను అమలు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులకు సంబంధించిన సీపీఎస్ రద్, పీఆర్సీ, డీఏ బకాయిలు, పెండింగ్ బిల్లుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలబెట్టేందుకు ఉద్యోగులు పనిచేస్తారని అన్నారు.

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతు ందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగు తున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతో ందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు.

# బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

విద్యాసంస్థల పేరును మార్చేందుకు ఆమోదం తెలిపారు. మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాలలు ఇక నుండి తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా సంస్థల సొసైటీగా మార్పు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఐఐటీలు, ఎన్ఐటీల వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించాలని నిర్ణయించారు. ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించడమే దీని ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఎంజేపీ వ్యవసాయ కళాశాలల్లో ఎంజేపీ విద్యార్థులకే ప్రవేశాలు కల్పించడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పలు సంస్కరణలకు సమావేశం ఆమోదం తెలిపింది. విద్యార్థి మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించారు. ప్రిన్సిపాల్ నియామకాలలో ప్రస్తుతం అమలులో ఉన్న 70 శాతం ప్రమోషన్లు, 30 శాతం ప్రత్యక్ష నియామకాల విధానాన్ని కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది. అలాగే రిటైర్డ్ ప్రిన్సిపాళ్లను అకడమిక్ కన్‌స్టలెంట్లుగా వినియోగించే అంశంపై కమిటీ ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలలు, కళాశాలల బ్జడెట్ పరిమితులకు ఆమోదం తెలిపిన సమావేశం, గురుకుల పాఠశాలలకు డెస్క్‌టాప్ కంప్యూటర్ల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూనియర్ కళాశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ సరఫరాకు కూడా ఆమోదం లభించింది. రాష్ట్రంలో 12 సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై పూర్తి నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పోటీ పరీక్షల్లో మరిన్ని విజయాలు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.పాఠశాలలు, జూనియర్ కళాశా లలు, డిగ్రీ కళాశాలలు, ప్రాంతీయ సమన్వయ కార్యాలయాల వివి ధ విభాగాలకు బ్జడెట్ పరిమితులను బోర్డు ఆమోదించింది. సందర్భంగా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, పోటీ పరీక్షల్లో విజయాలు, జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో అధిక ప్రవేశాలు సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

# ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

**ఖమ్మం,జూన్ 25 :** ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తు న్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తు న్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు.

# సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

దీనిని ఏ ఒక్కరూ రాజకీయ కోణంలో చూడకూడదన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ’సర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా జరిగే ఒక నిరంతర పక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అదే సమయంలో నకిలీ లేదా అక్రమ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఈ సవరణలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని, దీనిపై కొన్ని రాజకీయ పక్షాలు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని కిషన్‌రెడ్డి హితవు పలికారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ పక్రియపై కావాలనే అపోహలు సృష్టిస్తూ, ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి సవరణలు జరిగాయని గుర్తుచేసిన కేంద్రమంత్రి, ఇప్పుడు దీనికి రాజకీయ రంగు పులమడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులూ లేని పారదర్శకత కోసం ప్రజలు కూడా ఈ ’ఃూఎఖీ’ పక్రియలో భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

# గతాన్ని మరచి పోండి..అలాంటి పొరపాట్లు జరగవు

(మొదటి పేజీ తరువాయి)

ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రభుత్వం లేదు.. పవర్ లేదు కానీ గర్వంగా ఎక్కడనిపిస్తుందంటే ఎమ్మెల్యే పోయినా.. ఎంపీ పోయినా.. అధికారం పోయినా ఇంతమంది సోదరులు ఇక్కడికొచ్చి మీరు చేస్తున్న ప్రకటన మామూలు ప్రకటన కాదు.. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ గుండెల్లో రైళ్లను ఉరికించే గొప్ప దృశ్యం ఇక్కడ కనిపిస్తుందని చేవెళ్ల సమావేశాన్ని ఉద్దేశించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీ అందరికీ తెలుసు మనకు అధికారం పోయి రెండున్నరేళ్లయింది. ఎన్నికల ముందేమో నేను గుంపు మేస్త్రీని. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని ఫోజులు కొట్టిండు. ఇవాళ రియల్ ఎస్టేట్‌ను ఏం చేసిండు మరి.. బొంద పెట్టిండు.. వంద ఫీట్ల అడుగులో పాతిపెట్టే పని చేసిండని మండిపడ్డారు.మన ప్రభుత్వం, పెద్దలు కేసీఆర్ ఉన్నప్పుడు షాబాద్‌లో చందన్ వెల్లిలోకానీ, సీతారాంపూర్‌లో కానీ ఎకరం 30 లక్షలుండేది. కానీ అక్కడ ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్క్ తీసుకొచ్చిన తర్వాత అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఒక మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెల్స్‌ఫన్ ఇతర కంపెనీలు తీసుకొచ్చిన తర్వాత నేడు ఎకరం 3 కోట్లకు తక్కువ షాబాద్‌లో లేని పరిస్థితి ఉంది. అదే రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్షల మంది రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి పనిచేసుకునే తమ్ముళ్లు, చెలెళ్లందరూ ఇవాళ దివాళా తీసే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవేంటంటే ఎన్నికలకు ముందు ఎకరం కోటి రూపాయలు పలికింది కూడా ఇవాళ కనీసం రూ.50 లక్షలు, రూ.60 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. దారుణమైన పరిస్థితి ఉంది. ఎందుకీ పరిస్థితి ఉందనేది మనం ఆలోచన చేసుకోవాల్సి ఉందని కేటీఆర్ గుర్తు చేశారు.

# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు.

ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు.

# డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థులు, యువత ముందుకు రావాలి

■ పోలీసుల ఆధ్వర్యంలో సెయింట్ మేరీస్ హై స్కూల్లో డ్రగ్స్ పై అవగాహన సదస్సు









గోవిందరావుపేట (పస్రా) ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 25( పీపుల్స్ న్యూస్) మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప రిణామాలపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించే లక్ష్యంతో పసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం సెయింట్ మేరీస్ హై స్కూల్ లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు.ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రవీందర్ సూచనలతో, పసర సీఐ దయాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పాఠశాల గోడలపై డ్రగ్స్ వ్యతిరేక సందేశాలతో వాల్ పోస్టర్లు అంటించి, వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడితే వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని పోలీసు అధికారులు వివరించారు.ఎస్ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల పట్ల అవగాహన పెంపొందించడంలో ఎంతో ఉపయో గకరంగా నిలిచిందని పాఠశాల యాజమాన్యం అభిప్రాయ పడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు పెంటా రెడ్డి, స్టీఫెన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వేణు, ఉపాధ్యాయురాలు సుప్రియా, ఉపాధ్యాయ పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




హసన్ పర్తి జూన్ 25 ॥ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాలివెల్పుల గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక పోలీసులు, పాఠశాల సిబ్బంది హాజరై విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలగురించివివరించారు.విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలోసుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిటోరియస్ అవార్డులు



జూన్ 25।।హుజూరాబాద్
గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ పరిధిలోని 25 ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ అవార్డులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డీఈఓ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు భవిష్యత్తులో కూడా అదే కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని, అర్హత కలిగిన అధ్యాపకులు, మెరుగైన విద్యా వసతులు, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం, టాలెంట్ టెస్టులు నిర్వహించి బహుమతులు అందించడం, ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని డీఈఓ పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. వసుంధర, జిల్లా సైన్స్ అధికారి సీహెచ్ జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు టి. లింగారెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, రిటైర్డ్ హెచ్‌ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

■ ఎస్సీ కమిషన్‌కు సమతా సైనిక్ దళ్ వినతి
■ డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్




ములుగు, జిల్లా ప్రతినిధి జూన్ 25 (పీపుల్స్ న్యూస్)
రాష్ట్రంలోని నేతకాని, మహార్ సామాజిక వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది నేతకాని సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తీవ్ర సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంలో ఉన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీరి సంక్షేమం, ఉపాధి, విద్యా పురోగతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో నేతకాని, మహార్ సామాజిక వర్గాల ప్రత్యేక అస్తిత్వాన్ని పరిరక్షిస్తూ, ఒకే గెజిట్ పరిధిలో కొనసాగిస్తూ ప్రత్యేకంగా గ్రూప్ కేటాయించాలని ఆయన కోరారు. దీని ద్వారా జనాభా నిష్పత్తి ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు.ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న నేతకాని కుటుంబాలకు భూమి హక్కులు, స్థానిక ఉద్యోగాలు, రాజకీయ రిజర్వేషన్లు ఎస్టీలతో సమానంగా కల్పించాలని డిమాండ్ చేశారు. భూమిపై హక్కులు లేకపోవడం, ఉపాధి అవకాశాల కొరత కారణంగా ఈ వర్గం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు.ప్రభుత్వ గెజిట్ రికార్డుల్లో నేతకాని కులాన్ని “మాలసాలె” లేదా “నెత్కాని”గా తప్పుగా పేర్కొనడాన్ని వెంటనే సవరించి, వారి ప్రత్యేక అస్తిత్వానికి తగిన గుర్తింపును కల్పించాలని విజ్ఞప్తి చేశారు.నేతకాని సామాజిక వర్గం సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు ప్రత్యేక ప్యాకేజీలు, సంక్షేమ పథకాలు, నిధులు కేటాయించేలా ఎస్సీ కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని డా. మార్షల్ దుర్గం నగేష్ కోరారు. సామాజిక న్యాయ పరిరక్షణలో ఎస్సీ కమిషన్ సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

- సీఐ ఆకునూరి మహేందర్




హసన్ పర్తి జూన్ 26।।
అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హసన్‌పర్తిలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి సీఐ ఆకునూరి మహేందర్ పాల్గొని విద్యార్థులు, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు,సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు.అనంతరం పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు,స్థానిక ప్రజలతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ మహేందర్ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సై దేవేందర్, పోలీస్ సిబ్బంది,ప్రజాప్రతినిధులు, సుజాత విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సూరారం కృషి హై స్కూల్ లో మాదక ద్రవ్యాల పై అవగాహన సదస్సు,







కుత్బుల్లాపూర్ : జూన్ 25(పీపుల్స్ న్యూస్ )
సురారం కాలనీలో కృషి హై స్కూల్ లో మాదక ద్రవ్యాల పైన అవగాహన సదస్సు నిర్వహించబడింది.
ఈ సందర్భంగా సూరారం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధీర్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరం గా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరం గా ఉంటూ మంచి అలవాట్లతో శ్రద్ధగా ఆటపాటాలలో ముందుండి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుంది అని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు ఈ దేశ భవిష్యత్తు మీ పైనే ఆధార పడి ఉందని కావున విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ వాటిని ప్రోత్సహించే వారికి కూడా దూరంగా ఉండాలని తెలియజేశారు.
ఈ కార్యక్రమం లో సూరారం సి ఐ సుధీర్ కృష్ణ,ఎస్ ఐ వీ రాజు కృషి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే సుపరిపాలన...

## సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్.

- మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు వడ్డీలేని రుణాలతో ప్రభుత్వ అండ.
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇందిరమ్మఇండ్ల కేటాయింపు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.













ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 25 (పీపుల్స్ న్యూస్)

ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే తెలుసుకొని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.గురువారం ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మంగపేట మండల పరిధిలోని అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుడుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల రూపంలో రూ.61 వేల కోట్లకు పైగా సహాయం అందించామని తెలిపారు. గతంలో మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు మాత్రమే అందిన వడ్డీలేని రుణ పరిమితిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు.మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని, పాడి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి కలిసి పనిచేస్తే కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ప్రజలు జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల వద్దకే పరిపాలనను తీసుకువెళ్లడం ప్రత్యేక ప్రజా దర్బార్ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత క్రమంలో ఇండ్లను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా దరఖాస్తులు అందించే విధంగా ప్రత్యేక ఫార్మాట్ రూపొందించామని తెలిపారు. గ్రామాల వారీగా అందుతున్న దరఖాస్తుల ద్వారా స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, పరిష్కార చర్యలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు.ప్రతి దరఖాస్తును నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార స్థితిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే కారణాలను కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.అంతకుముందు మంగపేట మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆఫీస్ భవనాల నిధుల కింద రూ.150 లక్షల వ్యయంతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ భవన నిర్మాణ పనులకు మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్



జూన్ 25. హుజురాబాద్

హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో గురువారం ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల. సుహాసిని మనోజ్ రావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అనేక ఇందిరమ్మ ఇళ్ళను నిర్మాణం చేపట్టి బీద కుటుంబాలకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వెనుకబడిన కుటుంబాలను గుర్తించి పారదర్శకంగా పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను పేదలకు నిర్మాణం చేపట్టే అందించిందని దానిలో భాగంగానే ఈరోజు హుజురాబాద్ పట్టణంలో అనేక వార్డుల్లో ఇందిరమ్మ ఇల్లు పూర్తయిన వాటిని ప్రారంభోత్సవం చేసినట్లు టీన్ లో యజమానుల ముఖాల్లో చిరునవ్వు చూసామని ఈ సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ చొరవతో నియోజకవర్గ పరిధిలో వే లైన్లు నిర్మాణం చేపట్టి 80% పూర్తి చేయబడ్డాయని ఈ సందర్భంగా గృహ యజమానులు హుజరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ విదుదల ప్రణవ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చైర్ పర్సన్ సుహాసిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్ , కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ తిరుపతి, కౌన్సిలర్స్ శ్రీలేఖ, సమ్మయ్య , మొగిలి , మున్సిపల్ ఏఈ నరేష్ , హౌసింగ్ ఏఈ రోజా వార్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలి ఏఎస్ఐ కమల.




జూన్ 25. హుజురాబాద్

ప్రజలు ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటికి బానిస కావడం వల్ల అనేక అనార్థాలు కలుగుతాయని ఏ ఎస్ ఐ కమల అన్నారు. గురువారం హుజరాబాద్ లో ఆమె పలువురికి మత్తుపదార్థాలు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ మహేందర్ మాట్లాడుతూ మత్తుకు బానిస కావడం వల్ల యువకులు తమ జీవితాలను నష్టపోతున్నారని బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అంజలి, పలువురు యువకులు ,ప్రజలు, పాల్గొన్నారు.

## రాష్ట్రాల మధ్య పంచాయితీలు వద్దు



జూన్ 25 । హైదరాబాద్

హైదరాబాద్: రాష్ట్రాల మధ్య పంచాయితీలు పెట్టుకుని కేసులు పెట్టడం కంటే సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నది జలాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించడమే తమ లక్ష్యమని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.ఇదే సందర్భంలో అంతర్గత వ్యవహారాల్లో అవసరం లేని వివాదాలు సృష్టించడం మానుకోవాలని, ప్రజల అవసరాలే ప్రభుత్వానికి ప్రధానమని స్పష్టం చేశారు.10 టీంసిని నీ రాష్ట్రంలోఅంతర్జాతీయ స్థాయి వాణిజ్య సదస్సులు, పెట్టుబడుల కోసం తెలంగాణ రాష్ట్రం కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, అభివృద్ధి దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

## రూ.50 కోట్ల అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



జూన్ 25 । రామగుండం


పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో చేపట్టాల్సిన సుమారు రూ.50 కోట్ల అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంఎఫ్టీలో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు.గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జూలై రెండో వారంలోగా మంజూరైన మెజారిటీ పనులకు గ్రౌండింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి భవనాలు, తాగునీటి పథకాలు, విద్యాసంస్థలు, స్మశానవాటికల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.నరేగా నిధులను సమర్థంగా వినియోగించాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే 2బీహెచ్కే గృహాలకు విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రామగుండం నగరంలో పరిశుభ్రత, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్, బ్లాక్ స్పాట్ల నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం - బీఎల్వోలు ఇంటికి రాకుంటే కాల్ చేయాలని ఈసీ సూచన

హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఓటరు సవరణ–సర్ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే నెల 24 వరకూ నెల రోజుల పాటు కొనసాగే ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఎన్నికల సంఘం నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఫారాలు అందిస్తున్నారు. ఓటర్లే ఈ ఫారాలు నింపి 2, 3 రోజుల తర్వాత బీఎల్వోలకు అందజేయాలని అధికారులు సూచించారు. మొత్తంగా ఒక్కో ఇంటికి మూడుసార్లు బీఎల్వోలు వెళ్లనున్నట్లు ఎలక్షన్ కమిషన్ వెల్లడించింది.ఆన్లైన్లోనూ ఎన్యుమరేషన్ ఫారం : రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ మొదలైంది. హైదరాబాద్ హిమాయత్నగర్ వార్డు కార్యాలయంలో బీఎల్?వోలకు అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలు అందించగా వారంతా ఇంటింటికీ తిరిగి ఫారాలు అందిస్తున్నారు. తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు ఆన్లైన్లోనూ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.అప్రమత్తంగా లేకపోతే ఓటు తొలగిపోయే ప్రమాదం : ఎస్?ఐఆర్ ప్రక్రియను బీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీకర్ణన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖైరతాబాద్ ఫిల్మ్నగర్లో ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు ఓటర్లకు అందజేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసిన తర్వాత బీఎల్?వోలకు అందించాలని ఓటర్లకు సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ రెండో వార్డులో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ను స్థానిక ఎమ్మెల్యే సందర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు సవరణ ప్రక్రియలో అప్రమత్తంగా లేకపోతే ఓటు తొలగిపోయే ప్రమాదం ఉందని హైదరాబాద్ జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నారాయణగూడలోని పలు బస్తీలు, కాలనీలలో ఇంటింటికి తిరిగిన ఆయన ఎస్?ఐఆర్?పై ప్రజలకు అవగాహన కల్పించారు.సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలి : జిల్లాల్లోనూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరుగుతోంది. ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఎల్?వో, బీఎల్?ఏలు ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణి చేశారు. చనిపోయిన వారు, రెండు చోట్ల ఓటు ఉన్న వారిని గుర్తించి ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ ఉదయం నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్నారు. హనుమకొండ చైతన్యపురిప్రాంతంలో సమగ్ర ఓటరు సర్వే ప్రక్రియ తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరుకి ఫారాలు అందజేయాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని బీఎల్?వోలను ఆదేశించారు.ఎస్?ఐఆర్?కు సహకరించాలి : జగిత్యాల జిల్లా చల్గల్ గ్రామంలో ఎస్?ఐఆర్ ప్రక్రియ విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎస్?ఐఆర్?కు సహకరించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ అవగాహన కోసం 2కే రన్ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి బస్టాండ్కి సమీపంలోని ఐబీ గెస్ట్ హౌస్ వరకు రన్ జరిగింది.టోల్ ఫ్రీ నంబర్?కు ఫిర్యాదు చేయవచ్చు : సర్ ప్రక్రియ కోసం 119 ఈఆర్?వోలు, 882 ఏఈఆర్?వోలు, 3,596 సూపర్వైజర్లు, 35,985 బూత్ లెవెల్ ఆఫీసర్లను ఎన్నికల కమిషన్ నియమించగా వివిధ రాజకీయ పార్టీలు 49018 మంది బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాయి. ఒకవేళ బీఎల్?వో ఇంటికి రాకపోతే 1950 టోల్ ఫ్రీ నంబర్?కు ఫిర్యాదు చేయవచ్చని ఈసీ సూచించింది.



# మద్యం మత్తులో పాఠశాల పిల్లలను తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్ అరెస్ట్








**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** పాఠశాల విద్యార్థుల భద్రతను పణంగా పెడుతూ, మద్యం మత్తులో ఆటో నడుపుతున్న ఒక డ్రైవర్‌ను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీల్లో చాకచక్యంగా పట్టుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గోషామహల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలో ఈ నెల 24న ఉదయం 08:00 గంటల నుండి పాఠశాల బస్సులు, స్కూల్ ఆటోలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సబ్–ఇన్‌స్పెక్టర్ డి. జగదీష్, హోంగార్డులు కిరణ్ కుమార్, సురేష్‌లతో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 08:37 గంటల సమయంలో అబిడ్స్‌లోని 'స్లేట్ స్కూల్'కు చెందిన ఆరుగురు విద్యార్థులతో వెళ్తున్న టీఎస్ 12యుఎ 9230 నెంబర్ గల ఆటో రిక్షాను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ (35) ప్రవర్తనపై అనుమానం రావడంతో అతనికి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 60 ఎంజీ /100 ఎంఎల్ రీడింగ్ నమోదైంది. దీనితో అతడు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు ఖరారైంది. ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ట్రాఫిక్ సిబ్బంది.. విద్యార్థులను సురక్షితంగా దించి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం డ్రైవర్‌ను గోషామహల్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై గోషామహల్ లా అండ్ ఆర్డర్ పోలీసులు డ్రైవర్ షేక్ కేసు నమోదు చేశారు. పాఠశాల పిల్లలను రవాణా చేసే వాహనాల డ్రైవర్లు రవాణా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, విద్యార్థుల భద్రత మాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు

**- ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్**



**కుత్బుల్లాపూర్, జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లో గల ఠాగూర్స్ హై స్కూల్ లో 2024–25 బ్యాచ్ కు చెందిన జి.వైష్ణవి ఇంటర్ ఎంపిసి ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్ అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ 10వ తరగతిలో స్కూల్ తృతీయ ర్యాంకు సాధించిన వైష్ణవి పట్టుదలతో ఇంటర్ లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ ఉత్తమ ఫలితాలు సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ యేడు పదవ తరగతి రాసే విద్యార్థులు వైష్ణవిని ఆదర్శంగా తీసుకుని విద్యలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇక్కుర్తి నారాయణ రావు. రంగారెడ్డినగర్ డివిజన్ నాయకులు సతీష్ ఘట్టోజీ , పాఠశాల ఉపాధ్యాయులు శివ గోపి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి రూ 50 లక్షలు ఇవ్వాలి ఇవ్వకుంటే నగరబాటే



**కొడంగల్, జూన్ 25:** మక్తల్, కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం సంబంధించిన భూ నిర్వాసితులకు ప్రభుత్వం సరైన నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే ఉపాధి కోసం నగరబాట పట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎకరాకు రూ.50 నుంచి రూ.80 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ప్యాలమద్ది, పెద్దనందిగామ గ్రామాల్లో రెవె న్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం సరైన పరిహారం చెల్లించడం లేదని వాపోయారు. ఇక్కడ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెలిస్తే.. వేరేచోట భూములు కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటామని, లేకుంటే కూలీ కోసం నగరబాట పట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# 'బీబీ కా ఆలమ్' ఊరేగింపు సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** హైదరాబాద్‌లోని 'బీబీ కా అలావా' నుండి నిర్వహించబడే 'బీబీ కా ఆలమ్' ఊరేగింపు సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శుక్రవారం మధ్యాహ్నం 12:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ,మళ్లింపులు విధించినట్లు హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. బీబీ కా అలవా వైపునకు వాహనాల రాకపోకలు అనుమతించబడవు. ఈ ట్రాఫిక్‌ను సునార్‌గల్లీ 'టి' జంక్షన్ వద్ద దబీర్‌పురా దర్వాజా మరియు గంగా నగర్ నాలా, యాకుత్‌పురా వైపునకు మళ్లిస్తారని తెలిపారు. షేక్ ఫైజ్ కమాన్ వైపునకు వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను జబ్బార్ హోటల్ వద్ద అవసరాన్ని బట్టి దబీర్‌పురా దర్వాజా లేదా చంచల్‌గూడ వైపునకు మళ్లిస్తారన్నారు. ఏతేబార్ చౌక్ నుండి బడా బజార్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను ఏతేబార్ చౌక్ వద్ద పరిస్థితిని బట్టి కోట్లా అలీజా లేదా పురాణీ హవేలీ వైపునకు మళ్లిస్తారన్నారు. ప్రధాన ఊరేగింపు గంగా నగర్ నాలాకు చేరుకున్నప్పుడు, పురాణీ హవేలీ నుండి ఏతేబార్ చౌక్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను పురాణీ హవేలీ వద్ద చత్తా బజార్, దబీర్‌పురా లేదా ఎస్‌జే రోటరీ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు గంగా నగర్ నాలాకు చేరుకున్నప్పుడు, మొఘల్‌పురా మరియు వోల్టా హోటల్ నుండి ఏతేబార్ చౌక్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను బీబీ బజార్ చౌరస్తా వద్ద పారిస్ కేఫ్ లేదా తలాబ్ కట్ట వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు ఏతేబార్ చౌక్‌కు చేరుకున్నప్పుడు, మిట్టీ కా షేర్ , మదీనా నుండి ఏతేబార్ చౌక్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను గుల్జార్ హౌజ్ వద్ద మదీనా లేదా మిట్టీ కా షేర్ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు కోట్లా అలీజాకు చేరుకున్నప్పుడు, మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ నుండి చౌక్ మైదాన్ ఖాన్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను హఫెజ్ డంకా మసీదు వద్ద పారిస్ కేఫ్ లేదా బీబీ బజార్ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు చార్మినార్‌కు చేరుకున్నప్పుడు, శక్కర్‌కోట్ నుండి గుల్జార్ హౌజ్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. దీనిని మిట్టీ కా షేర్ జంక్షన్ వద్ద ఘన్సీ బజార్ లేదా చేలాపురా వైపునకు మళ్లిస్తారు. అదే సమయంలో ఏతేబార్ చౌక్ వద్ద ఉన్న ట్రాఫిక్‌ను కోట్లా పురాణీ హవేలీ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు చార్మినార్‌కు చేరుకున్నప్పుడు, నయాపూల్ నుండి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను మదీనా చౌరస్తా వద్ద సిటీ కాలేజ్ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు మీరాలం మండికి చేరుకున్నప్పుడు.. చాదర్‌ఘాట్ రోటరీ, నూర్ ఖాన్ బజార్, సాలార్ జంగ్ మ్యూజియం , శివాజీ బ్రిడ్జ్ నుండి పురాణీ హవేలీ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను సాలార్ జంగ్ రోటరీ వద్ద నయాపూల్, శివాజీ బ్రిడ్జ్ మరియు నూర్ ఖాన్ బజార్ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు అలవా సర్తౌక్‌కు చేరుకున్నప్పుడు, చాదర్‌ఘాట్ రోటరీ నుండి కాళీ ఖబర్ వైపు వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను చాదర్‌ఘాట్ రోటరీ వద్ద చాదర్‌ఘాట్ బ్రిడ్జ్ మీదుగా రంగమహల్ లేదా కోటి వైపునకు మళ్లిస్తారన్నారు. గౌలిగూడ లేదా అఫ్జల్‌గంజ్ నుండి సాలార్ జంగ్/శివాజీ బ్రిడ్జ్ వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. గౌలిగూడ వైపు ఉన్న సాలార్ జంగ్/శివాజీ బ్రిడ్జ్ ప్రవేశ ద్వారం వద్దనే ఈ ట్రాఫిక్‌ను తిరిగి అఫ్జల్‌గంజ్ మరియు గౌలిగూడ వైపునకు మళ్లిస్తారన్నారు. ఊరేగింపు అలవా సర్తౌక్‌కు చేరుకున్నప్పుడు, ఎస్‌జే రోటరీ వైపు వాహనాలను అనుమతించరు. ఈ ట్రాఫిక్‌ను నయాపూల్ వద్ద మదీనా వైపునకు మళ్లిస్తారన్నారు. ఏపీఎస్ఆర్టీసీ, టీజీఎస్ఆర్టీసీ జిల్లా బస్సుల రాకపోకలను ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 09:00 గంటల వరకు రంగమహల్ , అఫ్జల్‌గంజ్ వైపునకు మళ్లిస్తారు. ఊరేగింపు ముగింపు స్థానానికి చేరుకునే వరకు ఈ బస్సులను కాళీ ఖబర్ , మీరాలం మండి రోడ్డుపైకి అనుమతించరన్నారు. నగర పౌరులు, వాహనదారులు పై పేర్కొన్న ట్రాఫిక్ ఆంక్షలను గమనించి, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిందిగా అభ్యర్థించారు. తాజా ట్రాఫిక్ అప్‌డేట్ల కోసం మా అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను అనుసరించగలరు: ఫేస్‌బుక్: facebook.com/HYDTP (@Hyderabad Traffic ౖాశీశ్రీఱషవ) ఎక్స్ (ట్విట్టర్): ఏన్ఐూ ప్రయాణంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదా సహాయం కోసమైనా మా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్: 9010203626 ను సంప్రదించవచ్చు.

# ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను అరెస్ట్

**- రెండు అక్రమ తుపాకులు, ఏడు బుల్లెట్లు స్వాధీనం**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు అక్రమ తుపాకులు, ఏడు బుల్లెట్లను కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) , మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు స్వాధీనం పరుచుకున్నారు. వివరాల ప్రకారం.... చార్మినార్, ఖిల్వత్ కు చెందిన ముదస్సిర్ హుస్సేన్ అలియాస్ షా బాబా (24) , ఇంటర్మీడియట్ వరకు చదివిన ఇతడు, 2022లో ముంబై వెళ్లి 6 నెలల పాటు 'ఏబుల్–బాడీడ్ సీమన్' కోర్సు పూర్తి చేసి ఎల్‌అండ్‌టీ (ూడు) సంస్థలో రెండు నెలలు పనిచేశాడు. చదువుకునే రోజుల్లోనే కారు రెంటల్ వ్యాపారంలో కమిషన్ ఏజెంట్‌గా పనిచేసిన అనుభవంతో, ముంబైలో ఒక చేవ్రొలెట్ కారును రూ. 1,35,000/– కు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో ూాశ ద్వారా రూ. 1,75,000/– కు విక్రయించాడు. ఆ లాభంతో 2024 వరకు ముంబై నుండి పాత కార్లను కొని హైదరాబాద్‌లో అమ్మే వ్యాపారం చేశాడు. ఈ క్రమంలో ఇతని స్నేహితుడు షోయబ్ ద్వారా మహారాష్ట్రలో నేరచరిత్ర కలిగిన సూరజ్ సింగ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. సూరజ్ సింగ్ ముఠాతో చేతులు కలిపిన ముదస్సిర్.. కర్ణాటకలో ఒక దోపిడీ (ఋఏశీఱఎ) లో, అలాగే మహారాష్ట్రలో ఒక వ్యాపారవేత్త కిడ్నాప్ కేసులో పాల్గొని మహారాష్ట్రలోని పర్భణి జైలుకు వెళ్లాడు. జైలు నుండి విడుదలయ్యే సమయంలో ఇతని సహచరుడు ఒకరు భద్రపరచడానికి ఒక పిస్టల్, బుల్లెట్లను ఇచ్చాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముదస్సిర్.. తుపాకులు చూపించి దోపిడీలు చేసి సులభంగా డబ్బు సంపాదించాలని తన స్నేహితులతో కలిసి ప్లాన్ చేశాడు. ఈ క్రమంలోనే మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవర్ అమీర్ ఖాన్‌తో పరిచయం పెంచుకుని, అతడిని కూడా ఈ నేరాల్లో భాగస్వామిని చేశాడు. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో ఒక బెలేనో కారులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయుధాలతో తిరుగుతూ, ఏదైనా పెద్ద వ్యవస్థీకృత నేరానికి పాల్పడేందుకు ప్లాన్ చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. దీనిపై తక్షణమే స్పందించిన టాస్క్ ఫోర్స్ ,స్థానిక పోలీసులు.. మైలార్‌దేవ్‌పల్లిలోని 'మెహఫిల్ హోటల్' సమీపంలో సదరు కారును అడ్డుకుని, నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) , మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఉమ్మడిగా జరిపిన తనిఖీల్లో ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రెండు నాటు తుపాకులు (పిస్టల్స్), 7 సజీవ బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ప్రయాణిస్తున్న బెలేనో కారు (టిఎస్ 23ఎఫ్ 1701) ను అడ్డుకుని ఈ ముఠాను పట్టుకున్నారు. హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ జూబ్లీహిల్స్ జోన్ ఇన్స్పెక్టర్ యుగేందర్, సబ్–ఇన్స్పెక్టర్ మహమ్మద్ జాహెద్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది , మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి నిందితులను పట్టుకున్నారు.

# మోసపూరిత ప్రకటనలు ప్రచారంలోకి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్ఈబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహన్**





**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** మోసపూరిత ప్రకటనలు ప్రచారంలోకి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహన్ సూచించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో ట్రైనీ అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బందికి , స్టాక్ మార్కెట్ పై అవగాహన, పెట్టుబడి మోసాల నివారణపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వారి ఆధ్వర్యం లో సంయుక్తంగా "రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్"ను నిర్వహించారు. గురువారం సాయంత్రం తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీలు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆదేశాల మేరకు ట్రైనీ అధికారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ సెమినార్‌కు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) కె.ఆర్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఆర్థిక ప్రణాళికకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడులు పెట్టడం, రిస్క్ లను అంచనా వేసుకోవడం, చట్టబద్ధమైన మార్గాల్లోనే పెట్టుబడులు పెట్టడం ఎంతో అవసరమని సూచించారు. ప్రస్తుతం గూగుల్, మెటా వంటి డిజిటల్ వేదికలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి అనేక నకిలీ పెట్టుబడి పథకాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలను అరికట్టడంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎస్ఈ రీజినల్ మేనేజర్ రవి ఉప్పే మాట్లాడుతూ, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ముందు డీమ్యాట్ ఖాతా, ట్రేడింగ్ ఖాతా అవసరం, వాటి నిర్వహణ, పెట్టుబడి ప్రక్రియపై సవివర రంగా వివరించారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, పంప్ అండ్ డంప్ స్కామ్‌లు, డబ్బా ట్రేడింగ్, నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, అనధికారిక పెట్టుబడి సలహాల వల్ల పెట్టు బడిదారులు ఎదుర్కొంటున్న మోసాల గురించి ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ తరహా మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు ఎన్ఎస్ఈ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, నివారణ చర్యలను వివరించారు. సెమినార్ సందర్భంగా పెట్టుబడిదారుల కోసం రూపొందించిన అతి సాయి సాథి యాప్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడి సంబంధిత సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ట్రైనీలకు సమగ్ర అవగాహన కల్పించారు. సెమినార్ ముగింపు సందర్భంగా లైజన్ ఆఫీసర్ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీలు, అకాడమీ సిబ్బంది, ఎస్ఈబీఐ, ఎన్ఎస్ఈ ప్రతినిధులు, కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, ఎస్ ఈబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహన్, ఎన్ఎస్ఈ బెం గళూరు రీజినల్ మేనేజర్ రవి ఉప్పే, కోఆర్డినేటర్ , కంపెనీ సెక్రటరీ అభిలాష్ దరాక్, అకాడమీ ఔట్‌డోర్ ఎడి రాంబాబు, డీఎస్పీలు సతీష్ కుమార్, తిరుపతి, రిజర్వ్ ఇన్‌స్పె క్టర్లు మహేష్, శ్రీను, ప్రవీణ్, నహేర్, ట్రైనీ డీఎస్పీలు, ఫ్యాకల్టీ సభ్యులు, కార్యాలయ సూపరింటెండెంట్లు , ఇతర సిబ్బ ంది పాల్గొన్నారు.

# యువత , ఉద్యోగులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలి

**- కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్**









**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** యువత , ఉద్యోగులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్వ నాలెడ్జ్ సిటీ సాఫ్ట్‌వేర్ భవనంలో మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు , అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ హజరై మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం "మత్తు వద్దు... మంచి భవిష్యత్తు ముద్దు!" అనే సందేశాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ సి. హెచ్. శ్రీధర్, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సి.హెచ్. వెంకన్న,భూపతి పోలీసు సిబ్బంది, ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కవిత్వంలో నవీనత్వం కావాలి, రాజులను పొగిడే రచనలు పోవాలి!

నీకు ఎలాంటి కవిత్వం కావాలి...?
తప్పును ఎదిరించే ప్రశ్న కావాలి,
కుశల ప్రశ్నల రాతలు పోవాలి!
కలంలోంచి కవితల జల్లై కురవాలి,
పొలంలోంచి రైతుకలల పంటై పండాలి!
కవిత్వంలో నవీనత్వం కావాలి,
కళ్ళబొల్లి, చిల్లర మల్లర రాతలు పోవాలి!
నీకు ఎలాంటి కవిత్వం కావాలి...?
రాస్తే సమాజంలో మార్పు రావాలి,
ప్రవహించే కలాన చైతన్యం మురవాలి,
అది చదివి నరాలకు నవబిగువు రావాలి!
కవిత్వంలో నవీనత్వం కావాలి,
లక్ష్యం లేని లేఖనం పోవాలి!
నీకు ఎలాంటి కవిత్వం కావాలి...?
అవసరం లేని అక్షరాల పొందిక పోవాలి,
సారమైన ప్రశ్నల గొంతుక కావాలి!
అపారమైన అనుభవాల కాసారం నిండాలి,
సామాజిక రుగ్మతలకు వ్యాక్సిన్ లా మారాలి!

**కవిని కాదు రవిని నేను!**
**9948839437**

# రైతులకు సాంకేతిక సహాయం అందించనున్న రూటేజ్ స్మార్ట్ విలేజ్ సెంటర్



**జూన్ 25।। ఉమ్మడి కరీంనగర్ జిల్లా** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని పీఏసీఎస్‌లో నాబార్డ్ ఆధ్వర్యంలో భారతదేశపు తొలి పీఏసీఎస్ ఆధారిత రూటేజ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ప్రారంభమైంది. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ వర్చువల్‌గా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ చైర్మన్ షాజీ కె.వి., డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గోవర్ధన్ సింగ్ రావత్, తెలంగాణ ప్రాంత సీఎజీఎం ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.కేంద్రంలో అగ్రి డ్రోన్లు, మట్టి పరీక్ష యంత్రాలు, తేమ స్థాయిలను గుర్తించే పరికరాలు వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు సాంకేతిక సేవలు, డిజిటల్ అవగాహన, వ్యవసాయ పరికరాల వినియోగంపై శిక్షణ అందించనున్నారు.ఈ కేంద్రం రైతుల ఉత్పాదకత పెంపుతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించనుందని అధికారులు తెలిపారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

**- ఛాత్రినాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు**







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్) :** భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఛాత్రినాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా సాగుతున్న డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా, ఛాత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పుగూడ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం 'డ్రగ్స్‌కు నో చెప్పండి' అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఛాత్రినాక డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులోఆయనతో పాటు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె. నా యుడు, సబ్-ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి మాదకద్రవ్యాల (డ్రగ్స్) అలవాటు వల్ల కలిగే తీవ్ర దుష్ప్రభావాలను, అవి ఆరోగ్యం, చదువు, కుటుంబం , సమాజంపై చూపే ప్రతికూల ప్రభావాలను వివరించారు. విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు, వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా.. చదువు, క్రీడలు, క్రమశిక్షణ , సానుకూల అంశా లపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. తమ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్ వాడకం లేదా విక్రయాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు , విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం, మద్దతుతో ఈ అవగాహన కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో కోట్ల రూపాయల మోసం.. ముఠా అరెస్ట్




**జూన్ 25।।హైదరాబాద్**
హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల పేరుతో ప్రజలను మోసం చేసిన ముఠాను మల్కాజిగిరి జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ పథకాల కింద ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.బాధితుల ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నకిలీ అలాట్‌మెంట్ లెటర్లు, ముద్రలు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో 100 మందికి పైగా బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు వెల్లడైంది.ప్రభుత్వ అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి త్వరగా ఇళ్లు కేటాయిస్తామని నమ్మబలికినట్లు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి జోన్ డీసీపీ ప్రజలను ఉద్దేశించి, ప్రభుత్వ పథకాల కేటాయింపులు పూర్తిగా అధికారిక విధానాల ద్వారానే జరుగుతాయని, మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు.కేసు నమోదు చేసి, ముఠాకు సహకరించిన ఇతర వ్యక్తుల కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రజలు ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత , విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకం

**- సైఫాబాద్ ఎస్హెచ్ఓ ఎ. సీతయ్య**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 25 (పీపుల్స్ న్యూస్ ):** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత , విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమైనదని సైఫాబాద్ ఎస్హెచ్ఓ ఎ. సీతయ్య స్పష్టం చేశారు. సమాజంలో డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడమే లక్ష్యంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ. సీతయ్య ఆధ్వర్యంలో సబ్-ఇన్స్పెక్టర్లు , పోలీస్ సిబ్బంది కలిసి గురువారం చింతల్ బస్తీ ప్రాంతంలో భారీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల (డ్రగ్స్) అలవాటు వల్ల వ్యక్తిగత జీవితాలు, కుటుంబాలు , సమాజంపై పడే తీవ్ర దుష్ప్రభావాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. మాదకద్రవ్యాల సరఫరా లేదా వాడకానికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు , పోలీస్ సిబ్బంది చింతల్ బస్తీ వీధుల్లో పర్యటిస్తూ, ప్రజల్లో చైతన్యం నింపే విధంగా పలు నినాదాలు చేశారు. నిర్మల హైస్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు , సుమారు 150 మంది విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

# కుటుంబ కలహాలతో కలత చెంది వ్యక్తి ఆత్మహత్య



**జూన్ 25।।హుజూరాబాద్**
హుజూరాబాద్ పట్టణంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి స్మశాన వాటికలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, హుజూరాబాద్ పట్టణం లోని పోచమ్మవాడకు చెందిన పంజాల బిక్షపతి గౌడ్ (48) కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. రంగనాయకుల గుట్ట సమీపంలోని స్మశాన వాటికలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి కి తరలించారు.మృతుడికి భార్య శారద, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లేగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల



దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత ర్గి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి




**ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి**

**72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర**

**బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా**

**న్యూఢిల్లీ,జూన్25:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా–ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**బహుభార్యత్వం కూడా సమర్థనీయమే**

**మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు**

**తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు**



**ముంబై,జూన్25:** మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్–ఎ–హసన్, తలాక్–ఎ–అహ్సన్, తలాక్–ఎ–బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.



# నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

**- పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?**

**నల్గొండ,జూన్25:** జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటుపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

# గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

**● కొనసాగుతున్న సహాయక చర్యలు..సిఎం పర్యవేక్షణ**

**కోల్‌కతా,జూన్25:** మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

శుక్రవారం, జూన్ 26, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# జీవితంలో ఒక్కసారైనా దర్శించాల్సిన పుణ్యక్షేత్రం- 84 వేల మంది ఋషులు తపస్సు చేసిన దేవభూమి ఇదే!

హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా దర్శించాలని ఎదురు చూసే పుణ్యక్షేత్రం నైమిశారణ్యం. ఎనభై నాలుగు వేలమంది ఋషులు తపస్సు చేసిన తపోభూమిగా, ముక్కోటి దేవతలు కొలువుదీరిన దేవభూమిగా నైమిశారణ్యం ప్రసిద్ధి చెందింది. అందమైన ప్రకృతి సౌందర్యాలు మధ్య, ప్రశాంతమైన వాతావరణంలో, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండే ఆలయ సముదాయాలతో అలరారే పుణ్యక్షేత్రం నైమిశారణ్యం క్షేత్రం విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.





పురాణాల పుట్టినిల్లు!హిందూ సంప్రదాయం ప్రకారం ఏ వ్రతం చేసినా, ఏ పూజ చేసినా ఆ వ్రతానికి ఒక కథ ఉంటుంది. ప్రతి కథలోనూ 'పూర్వం నైమిశారణ్యంలో సూత మహాముని శౌనకాది ఋషులకు' అంటూ కథ ప్రారంభం కావడం మనకు తెలిసిందే! ప్రత్యేకించి సత్యనారాయణ స్వామి వ్రత కథ, వినాయక చవితి వ్రత కథ వంటి వాటిల్లో ఈ ప్రస్తావన మనందరికీ సుపరిచితమే! అలాగే వ్యాసమహర్షి అష్టాదశ పురాణాలు ఇక్కడే రచించారని ఈ క్షేత్ర స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. అంతేకాదు శ్రీ మద్ భాగవతం, పద్మ పురాణం, వాయు పురాణం, మార్కండేయ పురాణం వంటి అనేక పురాణాలు తొలిసారిగా ఋషులకు వివరించిన దివ్య ప్రదేశమే నైమిశారణ్యం. అందుకే ఈ క్షేత్రాన్ని పురాణాల పుట్టినిల్లుగా పిలుస్తారు.నైమిశారణ్యం ఎక్కడుంది?

నైమిశారణ్యం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సీతాపూర్ జిల్లాలో గోమతి నదీతీరంలో వెలసి ఉంది. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు స్వయంవ్యక్తమైన 8 తపోవనాల్లో నైమిశారణ్యం కూడా ఒకటి. భగవంతుడు తనంత తానే స్వయంగా ప్రకటితమైన ప్రదేశాలు దివ్యాలయాలుగా విరాజిల్లుతున్నాయి. అవే శ్రీరంగం, తిరుమల, ముక్తినాథ్, శ్రీముష్ణం, తోటాద్రి, పుష్కరం, బద్రీనాథ్, నైమిశారణ్యం. ప్రతి హిందువు తన జీవితకాలంలో ఈ 8 క్షేత్రాలు దర్శించాలని తపిస్తారు. ఇంతటి విశిష్టత కలిగిన నైమిశారణ్యం క్షేత్ర పురాణం గురించి తెలుసుకుందాం.క్షేత్ర పురాణం

ద్వాపర యుగం అంతమై కలియుగ ఆరంభమైన సమయంలో తాము తపస్సు చేసుకోవడానికి ఓ పుణ్య ప్రదేశాన్ని చూపించమని మహర్షులు, ఋషులందరూ కలిసి బ్రహ్మదేవుని ప్రార్ధించారంట! అప్పుడు బ్రహ్మ ఓ పెద్ద చక్రాన్ని సృష్టించి, మహర్షులను దానివెంట వెళ్లమని, ఎక్కడైతే ఆ చక్రం ఆగి విరుగుతోందో ఆ ప్రదేశమే తపోభూమి అని, యజ్ఞార్హత కలిగిన ప్రదేశమని సూచించాడంట! చక్రాన్ని అనుసరించిన మునులు

బ్రహ్మదేవుని ఆదేశం మేరకు మునులంతా చక్రాన్ని అనుసరించి వెళ్తే ఆ చక్రానికి ఉండే అంచు అంటే 'నేమి' ఈ అరణ్య ప్రాంతంలో పడిందట! అలా 'నేమి' పడిన అరణ్య ప్రాంతం కాబట్టి ఈ తపోవనానికి నైమిశారణ్యం అనే పేరు వచ్చింది. ఆ విధంగా నైమిశారణ్యం భగవంతుని స్వయంవ్యక్త క్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది.పురాణాలు బోధించిన పుణ్యభూమి

ఈ నైమిశారణ్యంలోనే వ్యాస మహర్షి చతుర్వేదాలను, అష్టాదశ పురాణాలను తన శిష్యులకు బోధించాడంట! అలాగే సూత మహాముని, శౌనకాది మునులకు అష్టాదశ పురాణాలు ఇక్కడే వినిపించాడట! వైశంపాయనుడు కూడా ఇక్కడే భాగవత పారాయణ చేసాడంట! అలాగే సూత ముని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత విధానాన్ని, వ్రతకథను తొలిసారిగా నైమిశారణ్యంలోనే వివరించాడంట! అలాగే శ్రీరాముడు నైమిశారణ్యంలోనే అశ్వమేధ యాగాన్ని చేసి, సీతాదేవి పేరిట ఓ గ్రామాన్ని దానం చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఆ గ్రామాన్నే ఇప్పుడు సీతాపూర్ గా పిలుస్తున్నారు. నడిచే దైవంగా ఖ్యాతి చెందిన శ్రీ ఆది శంకరాచార్యుల వారు కూడా తమ దిగ్విజయ యాత్రలో భాగంగా నైమిశారణ్యాన్ని సందర్శించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.నైమిశారణ్యంలో దర్శించాలి ్సన ఆలయాలుఅనేక ఆలయాలకు నెలవుగా చూద్దాం.చక్రతీర్థంబ్రహ్మదేవుడు విసిరిన చక్రం పడిన పవిత్ర ప్రదేశమే చక్రతీర్థం. ఈ పవిత్ర తీర్థంలో స్నానమాచరిస్తే శారీరక మానసిక రుగ్మతలు నయమవుతాయని విశ్వాసం. ఈ చక్రతీర్థం చుట్టూ వినాయకుడు, సీతారామలక్ష్మణులు ఆలయాలతో పాటు ప్రధానంగా భూతేశ్వర్ మహాదేవ్ మందిరాన్ని కూడా భక్తులు తప్పకుండా దర్శించుకోవాలి. పరమేశ్వరుడు ఇక్కడ స్వయంభువుగా, నైమిశారణ్య రక్షకుడిగా వెలిశాడని అంటారు. సీతాదేవి పూజించిన ఈ స్వామికి అభిషేకం చేస్తే ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించిన ఫలం కలుగుతుందని శాస్త్ర వచనం.లలితాదేవి ముఖ్య

గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో

# పౌర్ణమికి ముందు కుబేర పూజ- ఇలా చేస్తే అష్టైశ్వర్యాలు మీ సొంతం!

ఐశ్వర్యానికి అధిపతియైన కుబేరుని భక్తితో పూజించే వారికి సకల సంపదలతో పాటు ఆయురారోగ్య ఐశ్వర్య భాగ్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. మరి భాగ్యాలను ప్రసాదించే కుబేరుని ఎప్పుడు పూజించాలి? ఎలా పూజిస్తే అదృష్టం వరిస్తుందో ఈ కథనంతో తెలుసుకుందాం.

**ఎవరీ కుబేరుడు?**

సహజంగా కుబేరుని పేరు వినగానే వేంకటేశ్వర స్వామికి అప్పిచ్చిన వాడిగా మాత్రమే గుర్తొస్తుంది. సాక్షాత్తు శ్రీమన్నారాయణుని స్వరూపం, లక్ష్మీదేవికి పతి అయిన వేంకటేశ్వర స్వామి అంతటివానికే అప్పిచ్చాడంటే కుబేరుడు మహా ధనవంతుడని తెలుస్తోంది. మన నిత్యజీవితంలో డబ్బున్న మారాజుల్ని కుబేరులతో పోలుస్తాం. సిరి సంపదలకు, నవ నిధులకు అధిపతి అయిన కుబేరుడు ఉత్తర దిక్పాలకుడు. అథర్వణ వేదం ప్రకారం ఈయన గుహ్యాధిపుడు. కుబేరుడు అంటే 'కు' అంటే అవలక్షణాలున్న, 'బేరం' అంటే శరీరము కలవాడు అని అర్థం.

పురాణాల ప్రకారం కుబేరుని స్వరూపం

కుబేరుడు పేరుకి తగ్గట్టుగానే పొట్టిగా, పెద్ద పొట్టతో, మూడు కాళ్లు, ఒకే కన్ను, ఎనిమిది పళ్ళతో ఉంటాడని, ముఖము ఎడమ వైపుకి వాలినట్టు ఉంటుందనీ మన పురాణాలలో వివరించి ఉంది. శివ పురాణం, మత్స్య, స్కంద పురాణాల ప్రకారం, కుబేరుని శరీరం వినాయకుని పోలి ఉంటుందని తెలుస్తోంది.

**కుబేరుని జననం**


కైలాసం వద్ద ఉండే అలకానగరం కుబేరుని నివాస స్థలం. భరద్వాజ మహర్షి తన కుమార్తె అయిన దేవవర్ణిని విశ్రవునికిచ్చి వివాహం జరిపించారు. వీరిరువురికి జన్మించిన వాడే . విశ్రవుని కుమారుడు కాబట్టి ఇతనికి వైశ్రవణుడని పేరు. ఈ వైశ్రవణుడే కుబేరుడు.

**సకలజన పూజనీయుడు**

హిందువులే కాక, బౌద్ధ, జైన మతాల వారు కూడా అధికంగా పూజించే దైవం కుబేరుడు. బౌద్ధులు ఈయనని వైశ్రవణుడు లేదా జంభాలుడు అని పిలుస్తారు. ఈ విశ్వంలో అనేక సంపదలున్నాయి. అయితే ఆ సంపద ఏదైనా, అది ఏ రూపంలో ఉన్నప్పటికీ దానికి అధిపతి మాత్రం కుబేరుడే !

**నవనిధులు**

మన పురాణాల ప్రకారం నవనిధులనే గొప్ప సంపదలున్నాయి. అవే పద్మనిధి, మహాపద్మ నిధి, శంఖనిధి, మకరనిధి, కచ్ఛపనిధి, ముకుందనిధి, కుందనిధి, నీలనిధి, వర్చసనిధి అనే వాటిని 'నవ నిధులు' అంటారు. ఈ




నవనిధులు కుబేరుని అధీనంలో వుంటాయి. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి అర్చావతారమైన శ్రీ వేంకటేశ్వరస్వామి కూడా తన వివాహానికి అవసరమైన ధనాన్ని కుబేరుని నుంచే అప్పుగా తీసుకున్నాడు. అలాంటి కుబేరుడి అనుగ్రహం లభిస్తే అంతకన్నా అదృష్టం ఏముంటుంది? ఐశ్వర్యానికి అధిపతియైన కుబేరుని భక్తితో పూజించుకునే వారికి సకల సంపదలతో పాటు ఆయురారోగ్య భాగ్యాలు కలుగుతాయని విశ్వాసం. మరి కుబేరుని ఎలా పూజిస్తే అదృష్టం వరిస్తుందో తెలుసుకుందాం.

**కుబేరుని పూజా విధి**

శుక్రవారం పౌర్ణమి కలిసి వచ్చిన రోజు కానీ, శుక్రవారం దశమి తిథి రోజుకాని, లేదా పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు కానీ కుబేర పూజ చేయడం శ్రేష్టం. ముఖ్యంగా అధికమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం కుబేర పూజ చేయడం అన్ని విధాలా శ్రేష్టమని పండితులు చెబుతున్నారు. మే 29, అధికమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం ఈ పూజ చేయడం శుభకరం. ఈ రోజు సూర్యోదయంతో తలారా స్నానం చేసి పూజామందిరాన్ని శుభ్రం చేసుకుని ఇల్లంతా సువాసన భరితమైన ధూపాన్ని వేయాలి. ప్రశాంతమైన మనసుతో పూజ ప్రారంభించాలి. రాహుకాలం, యమగండం లేని సమయంలో పూజ ప్రారంభించాలి. కుబేరుని అనుగ్రహం కోసం చేసే ఈ పూజ వీలైనంత వరకు శుక్రవారం సంధ్యా సమయంలో చేయడం అధిక ఫలాన్ని ఇస్తుందని శాస్త్రం చెబుతోంది.

**పూజకు ఇలా సిద్ధమవుదాం**

పూజామందిరంలో తూర్పు దిశలో పద్మాసనంలో కూర్చోవాలి. ముందుగా చెక్కతో చేసిన పీటపై పసుపు లేదా ఎర్రటి వస్త్రాన్ని పరచాలి. పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, చందనం, అరటి ఆకు, మామిడాకులు, తమలపాకులు, ఫల పుష్పాలు, సాంబ్రాణి, కర్పూరం, నవధాన్యాలు, అరటి పండ్లు ముందుగా సిద్ధం చేసుకుని ఉంచుకోవాలి.

**కలశపూజ**

ఒక రాగి చెంబులో కానీ, వెండి చెంబులో కానీ శుద్ధ జలాన్ని నింపి, అందులో కొంచెం పసుపు, కుంకుమ, అక్షింతలు, రూపాయి నాణెం వేసి కలశాన్ని సిద్ధం చేసుకోవాలి. ముందుగా సిద్ధం చేసుకున్న పీటపై గణపతిని, కులదైవాన్ని, కుబేరుని యంత్రం, ధన్వంతరీ భగవానులను చిత్రపటాలను ప్రతిష్టించుకోవాలి. కలశం ఎదురుగా నెయ్యితో దీపాలు వెలిగించాలి. ముందుగా భూమి పూజ, కలశ పూజ శాస్త్రోక్తంగా చేయాలి.

**గణపతి పూజ**

ముందుగా విఘ్నాలు తొలగించమని ప్రార్థిస్తూ గణాధిపతిని పూజించాలి. పసుపు గణపతిని తయారు చేసి గణేశుని షోడశ నామాలతో పూజించాలి. అనంతరం వినాయకుని పంచామృతాలతో అభిషేకించాలి. ఓం గం గణపతయే నమ: అని ఐదు సార్లు జపించాలి. ఒక తమలపాకులో చిన్న బెల్లం ముక్కను ఉంచి గణనాథునికి నివేదించి నమస్కరించుకోవాలి.

**ఇంట్లోని నిధి పూజ**

గణపతి పూజ పూర్తయ్యాక మన ఇంట్లో ఉన్న బంగారు లేదా వెండి ఆభరణాలను పవిత్ర జలాలతో శుభ్రంగా కడిగి పూజలో ఉంచాలి. అలాగే కాంస్యం లేదా ఇత్తడి ఆభరణాలుంటే వాటిని కూడా శుభ్రం చేసి పూజలో ఉంచాలి. బంగారు వెండి ఆభరణాలను పసుపు, అక్షింతలతో పూజించాలి. అలాగే కాంస్యం లేదా ఇత్తడి ఆభరణాలను కుంకుమ, సింధూరం, అక్షింతలతో పూజించాలి.

కుబేరుని యంత్రం పూజ

కుబేరుని యంత్రాన్ని భక్తిశ్రద్ధలతో అక్షింతలతో, పారిజాత పూలతో కుబేర అష్టోత్తరాన్ని పఠిస్తూ పూజించాలి. అనంతరం ఓం శ్రీ కుబేరాయ నమ:, ఓం గళ హారతి ఇచ్చి నమస్కరించుకోవాలి.

కుబేర పూజాఫలం

విశేషమైన శుభ ఫలితాలనిచ్చే ఈ కుబేర పూజ భక్తిశ్రద్ధలతో ఆచరించడం వలన ఎన్నో జన్మల నుంచి వెంటాడుతూ వస్తున్న దారిద్ర్యం తొలగుతుంది. ఈ పూజ చేసిన వారి వంశంలో

# నీలి మేఘమాలవో, నీలాల తారవో!

నీలి మేఘ మాలవో, నీలాల తారవో! నీ సోయగాలలో మదినీ దోచిపోదువో.. రాగాల తేలిపోదమే! జాగేల చాలునే! రావో యుగాల ప్రేయసీ నన్నాదరించవే!" అంటూ ఖాళీగా ఉన్నపుడు మనసులో పాడుతుంటారా? లేదంటే ఖాళీ ప్లేట్ పట్టుకుని వేళ్లతో సరిగమలు వాయిస్తుంటారా?అవేమీ కాదు! నేను మ్యూజిక్ లవర్ మాత్రమే! అంటారా? సరిగ్గా ఇలాంటి వాళ్ల కోసమే ఓ సరికొత్త ట్రెండ్ నడుస్తోందని మీకు తెలుసా ఆపాత మధురాలు మొదలుకుని ఇవాళ్టి రొమాంటిక్ గీతాల వరకూ మనసుకి నచ్చిన పాటల్ని అందరితో కలిసి ఆనందంగా పాడుకోవడమే జామింగ్. సమయం శనివారం సాయంత్రం. అక్కడికి మిమ్మల్ని ఎవరూ ఆహ్వానించరు! మీకు మీరుగా వెళ్లి ఆస్వాదించడమే! పదండి! జామింగ్ సెషన్స్ అంటే ఏమిటో చూద్దాం!వీకెండ్ అండే పార్టీలు, పబ్?లే అనుకుంటుంటారు చాలా మంది. కానీ, కొంత మందికే తెలిసిన ట్రెండ్ జామింగ్ సెషన్. కేవలం శనివారం సాయంత్రం ఓ చిన్నపాటి కెఫేలో కలుస్తారు. అందరూ కొత్తవాళ్లే! సంగీత విద్వాంసులెవరూ ఉండరు. మీకు నచ్చిన పాట, నచ్చిన రాగంలో పాడుకోవడమే కాదు! మీకు నచ్చిన మ్యూజిక్ పరికరాన్ని తీసుకుని స్వరాలు పలికించొచ్చు. అందరూ కొత్తవాళ్లే కావడంతో సిగ్గు పడాల్సిందేమీ లేదు. పైగా అక్కడికి వెళ్తే చాలు! మీ ఆనందం రెట్టింపవుతుందనడంలో గ్యారెంటీ ఖాయం.మహిళలూ – మీ జీవ గడియారం సరిగానే పనిచేస్తోందా?అక్కడకి వచ్చేవాళ్లంతా కొత్తవాళ్లే. కానీ, మైక్ ముందుకు వెళ్లగానే వాళ్ల బిడియం మాయమైపోయి పాడుతుంటే ఒకరు గిటార్ మీటుతుంటారు, మరొకరు కీబోర్డ్ పై



వేళ్లను నాట్యం చేయిస్తుంటారు. మిగిలిన వారంతా మీ పాటను వింటూ, మ్యూజిక్ ఎంజాయ్ చేస్తూ లయబద్ధంగా చప్పట్లు కొడుతుంటారు. మీ ప్రతిభ ఏమాత్రం కొలమానం కాదు! పాల్గొనడమే జామింగ్ సెషన్స్? ప్రత్యేకత.మహిళలకు మాత్రమే!మీ మనసుకి నచ్చిన పాటల్ని నచ్చినట్లుగా అందరితో కలిసి ఆనందంగా పాడుకోవడమే జామింగ్ ప్రత్యేకత. ఇక్కడ ఎవరూ గొప్ప సింగర్లు, జడ్జిలు కాదు. సంగీతాన్ని ప్రేమించడమే వారి ప్రధాన అర్హత. అందుకే, గృహిణులు, విద్యార్థినులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగినులు ఈ సంగీత వేదికల వైపు అడుగులు వేస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారూ అక్కడకు చేరుకుంటున్నారు. మోడర్న్ మహిళల 'ఎమోషనల్ డీటాక్స్' సెంటర్స్‌గా మెట్రో నగరాలకు పరిమితమైన వీటి సందడి నుంచి నేడు టైర్ 2,3 పట్టణాలకూ చేరుతోంది.ఒత్తిడిని మాయం చేసే "మ్యూజిక్ థెరపీ"ఉరుకుల, పరుగుల జీవనశైలితో మహిళలకు వ్యక్తిగత సమయం దొరకడం లేదు. ఈ జీవన ప్రయాణంలో తమని తాము కోల్పోతున్నామనే చాలామంది భావన. దీన్ని పోగొట్టేందుకు జామింగ్ సెషన్స్ వంటివి మ్యూజిక్ థెరపీగా పనిచేస్తున్నాయి. చాలామందికి పాటలు పాడాలనే కోరిక ఉన్నా 'స్టేజ్ ఫియర్' పెద్ద అవరోధంగా ఉంటుంది. 'ఎవరు, ఏమనుకుంటారో' అనే బిడియం వారిని అడ్డుగోడగా మారుతుంది. కానీ, ఈ జామింగ్ కల్చర్ వాటన్నింటినీ తుడిచేస్తుంది. తప్పులు దొర్లినా, స్వరం కాస్త అటు ఇటు అయినా పాడే ప్రతి పాటకూ చప్పట్ల రూపంలో మీకు ప్రోత్సాహం దొరుకుతుంది. సరిగ్గా ఇలాంటి ప్రోత్సాహక పూరిత స్వేచ్ఛా వాతావరణం అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. ఈ నేపథ్యంలో ఇంటి పనులు, ఉద్యోగాల్లో ఒత్తిడి ఫీలవుతున్న మహిళలే కాదు! విద్యార్థినులూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సంస్కృతిలో భాగమవ్వడానికి గృహిణులూ ఆసక్తి చూపుతున్నారు. తమలో దాగున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకుంటూనే మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు.మనిషికీ, మనిషికీ మధ్య దూరం పెరుగుతున్న ఈ రోజుల్లో ఇలాంటి జామింగ్ సెషన్స్ (సంగీత వేదికలు) సామాజిక చొరవనూ పెంచుతున్నాయి. కేవలం పాటలే కాదు కొత్త ఆలోచనలకు సైతం వేదికవుతున్నాయి. వృత్తిపరమైన సలహాలు ఇచ్చి పుచ్చుకోవడంతో పాటు కొత్త స్నేహాలు చిగురిస్తున్నాయి. మీరూ ఈ సంగీత సాయంత్రాల్లో పాల్గొనండి, వినిపించే ప్రతి రాగంలోనూ ఒక కొత్త కథ, పలికే ప్రతి స్వరంలోనూ ఒక కొత్త స్నేహం మిమ్మల్ని

# వయస్సు పెరగడం సహజమే - యవ్వనం మీ చేతుల్లోనే ఉందని తెలుసా!



: వయసు పెరగడం అనేది సహజమైన ప్రక్రియ. కానీ, మన చర్మం అనేది ఎల్లప్పుడూ యవ్వనంగా, ఆరోగ్యంగా ఉండాలంటే, అది మన చేతుల్లోనే ఉందట. ఇందుకు కోసం మార్కెట్లో దొరికే ఖరీదైన యాంటీ ఏజింగ్ క్రీములు లేదా బ్యూటీ ట్రీట్?మెంట్లు అవసరం లేదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఉదయం నిద్ర లేచాక పాటించే అలవాట్లే అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. మరి, మిమ్మల్ని ఎప్పటికీ యవ్వనంగా, ఆరోగ్యంగా ఉంచే ఆ అలవాట్లు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం : ఉదయం నిద్రలేవగానే చాలామంది టీ లేదా కాఫీ తాగుతుంటారు. అందుకు, బదులుగా ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఇటు ఆరోగ్యానికి, అటు చర్మానికి మంచిదంటున్నారు నిపుణులు. ఇది జీవక్రియను వేగవంతం చేయడంతో పాటు టాక్సిన్స్?ను బయటకు పంపుతుందట. అలాగే, చర్మాన్ని రీహైడ్రేట్ చేస్తుంది. ఈ క్రమంలో గోరువెచ్చని నీటికి కొంచెం నిమ్మరసం లేదా ఉసిరి రసం కలిపితే మరింత మంచిదట. ఎందుకంటే, వీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి వృద్ధాప్యాన్ని వేగవంతం చేసే ఫ్రీ రాడికల్స్?తో పోరాడుతాయి. అంతేకాకుండా, జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు చర్మం ఆరోగ్యానికి ఉండటానికి సహాయపడతాయి.

ఉద్యోగంపై ఆసక్తి తగ్గుతోందా? – ఈ టిప్స్ పాటిస్తే బెటర్ అంటున్న ఎక్స్?పర్ట్స్?!

శరీరాన్ని కదిలించడం : శారీరక శ్రమ కోసం ఉదయం 6 గంటలకే జిమ్?కు వెళ్లాల్సిన అవసరం లేదు. ఉదయాన్నే కాసేపు నడవడం, తేలికపాటి యోగా చేయడం లేదా నచ్చిన పాట పెట్టుకుని డాన్స్ చేయడం లాంటి అలవాట్లు కూడా ఆరోగ్యానికి మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో శారీరక కదలికల వల్ల రక్త ప్రసరణ పెరుగుతుంది. చర్మానికి ఆక్సిజన్ అందుతుంది. అంతేకాదు, కార్టిసాల్ హార్మోన్ తగ్గుతుంది. ఒకవేళ కార్టిసాల్ స్థాయిలు ఎక్కువైతే శరీరంలో వాపు పెరిగి, వృద్ధాప్యం వేగంగా వస్తుంది. కాబట్టి, ఉదయం కాసేపు బాడీని స్ట్రెచ్ చేయడం చాలా మంచిదట.సన్? స్క్రీన్ : చాలామంది బయటకు వెళ్లినప్పుడు మాత్రమే సన్?స్క్రీన్ వాడుతుంటారు. కానీ, ఇంట్లో ఉన్నా లేదా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు కూడా సన్?స్క్రీన్ రాసుకోవాలంటున్నారు నిపుణులు. ఎందుకంటే, సూర్యుడి నుంచి వచ్చే ఖఎ కిరణాలు కిటికీల గుండా సులభంగా లోపలికి ప్రవేశిస్తాయి. అలాగే, మొబైల్, కంప్యూటర్? లేదా టీవీ స్క్రీన్?ల నుంచి వచ్చే 'బ్లూ లైట్' కూడా మన చర్మంలోని కొల్లాజెన్?ను దెబ్బతీస్తాయట. అలాగే, చర్మంపై మచ్చలు, వయసు పైబస్క్రీన్?ల నుంచి వచ్చే 'బ్లూ లైట్' కూడా మన చర్మంలోని కొల్లాజెన్?ను దెబ్బతీస్తాయట. అలాగే, చర్మంపై మచ్చలు, వయసు పైబడినట్లు కనిపించేలా ముడతలు వస్తాయి. అందుకే, వాతావరణం లేదా సీజన్ ఏదైనా, ప్రతిరోజూ సన్‌స్క్రీన్ అప్లై చేయడం తప్పనిసరి అని పేర్కొంది.సానుకూలంగా ఉండటం : ఉదయం లేవగానే మానసిక స్థితి, ఆలోచనలు మన చర్మంపై నేరుగా ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఉదయం సానుకూలంగా ఉండటం వల్ల ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయని చెబుతున్నారు. తద్వారా, చర్మంలో జిడ్డు ఉత్పత్తి అదుపులో ఉండి మొటిమలు రాకుండా ఉంటాయట. అంతేకాదు, సానుకూల ఆలోచనల వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి చర్మకణాల నష్టాన్ని నివారిస్తుంది. దీనివల్ల ముఖం అలసిపోయినట్లు కాకుండా, కాంతివంతంగా కనిపిస్తుంది.

బ్రేక్?ఫాస్ట్ : చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం యాంటీ ఏజింగ్ క్రీములు రాస్తే సరిపోదు, మనం తీసుకునే పోషకాహారం కూడా అంతే ముఖ్యమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మనం ఉదయం తినే టిఫిన్ లేదా ఆహారమే మన చర్మ సౌందర్యాన్ని, అలాగే మన శరీరం ఎంత వేగంగా ముసలితనానికి గురవుతుందో నిర్ణయిస్తుందట. అందుకే, యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని ఎంచుకోవాలట. ఎందుకంటే, సమతుల్యమైన అల్పాహారం ఆక్సిడేటివ్ స్ట్రెస్?తో పోరాడుతుంది. కొల్లాజెన్?కు మద్దతు ఇస్తుంది. అలాగే, చర్మానికి లోపలి నుంచి మెరుపును ఇస్తుంది.సానుకూలంగా ఉండటం : ఉదయం లేవగానే మానసిక స్థితి, ఆలోచనలు మన చూపుతాయంటున్నారు నిపుణులు. ఉదయం సానుకూలంగా ఉండటం వల్ల ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయని చెబుతున్నారు. తద్వారా, చర్మంలో జిడ్డు ఉత్పత్తి అదుపులో ఉండి మొటిమలు రాకుండా ఉంటాయట. అంతేకాదు, సానుకూల ఆలోచనల వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి చర్మకణాల నష్టాన్ని నివారిస్తుంది. దీనివల్ల ముఖం అలసిపోయినట్లు కాకుండా, కాంతివంతంగా కనిపిస్తుంది.

చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# నూతన దేవాలయ నిర్మాణం, జమ్ములమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

– ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 25 :** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన జమ్ములమ్మ ఆలయం లో గురువారం ఏ ఐ పి సి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. రాంపురం గ్రామంలో గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో నూతన దేవాలయం నిర్మించి జములమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించి గత రెండు రోజులుగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ముక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు పాల్గొన్న ఏఐపిసి స్టేట్ చైర్మన్, వనపర్తి నియోజవర్గ యువ నాయకులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డికి జమ్మలమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేపట్టి అమ్మ వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేశ్వరమ్మ, గ్రామస్తులు శివరాజు, రాంపురం సహదేవుడు, ఈశ్వర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఎమ్ కె మూర్తి, ఎం దేవన్న యాదవ్,జ పాతపల్లి చంద్రశేఖర్,

# ట్రాయ్ ఆధ్వర్యంలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు!

■ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన!

**హుస్నాబాద్, జూన్ 25 :** టెలికాం వినియోగదారులకు వారి హక్కులు, టెలికాం సేవలకు సంబ ంధించిన అంశాలు, సైబర్ మోసాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం హుస్నాబాద్ వైశ్య భవన్‌లో టెలికాం వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యు లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, టెలికాం వినియోగదారులు, కేబుల్ ఆపరేటర్లు, వినియోగదారుల ఫోరమ్ ప్రతినిధులు మరియు టెలికాం సేవా సంస్థల ప్రతిని ధులు పాల్గొన్నారు. ట్రాయ్ హైదరాబాద్ కన్సల్టెంట్ ఎ. కిష్టయ్య స్వాగతం పలికి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు.

అనంతరం ట్రాయ్ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ జాయింట్ అడ్వైజర్ కె.వి. సురేష్ బాబు మాట్లాడుతూ టెలికాం రంగ అభివృద్ధి, వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ట్రాయ్ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. అవాంఛిత కాల్స్, స్పామ్ సందేశాల నియంత్రణ, టెలికాం ఫిర్యాదుల పరిష్కారం, మొబైల్ నంబర్ పోర్టబిలిటీ, సేవల నాణ్యత, ఈఎంఎఫ్ రేడియేషన్, టవర్ మోసాలు, కేబుల్ మరియు ప్రసార సేవలపై ట్రాయ్ తీసుకుంటున్న చర్యలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టెలికాం సేవల నాణ్యతను అంచనా వేయడానికి, స్పామ్





కాల్స్‌ను నివారించడానికి 'మై కాల్', 'మై స్పీడ్', 'డీఎన్‌డీ' వంటి ట్రాయ్ యాప్‌లను వినియోగించాలని సూచించారు.

ఆర్డీవో వి. రామ్మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొబైల్ ఫోన్లు ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వినియోగదారులకు అవగాహన ఎంతో అవసరమని పేర్కొన్నారు. హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల దర్యాప్తు జరుగు తోందని, వివిధ రకాల సైబర్ మోసాల గురించి ప్రజలకు వివరించారు. ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందిస్తే నష్టాన్ని గణనీయంగా తగ్గించవ చ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ మాట్లాడుతూ టెలికాం



మరియు ప్రసార సేవల వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించడం, సైబర్ మోసాలపై చైతన్యం పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ట్రాయ్ అధికారులను అభినందించా రు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఏపీ ఎల్‌ఎస్‌ఏకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ (సెక్యూరిటీ) డి. మధుకర్ సైబర్ మోసాల నివారణ, వినియోగదారుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం మరియు డీఓటీ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో ట్రాయ్ హైదరాబాద్ కన్సల్టెంట్ ఎ. కిష్టయ్య పాల్గొన్న ప్రభుత్వ అధికారులు, మహిళా సంఘాలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, వినియోగదారులు, కేబుల్ ఆపరేటర్లు మరియు టెలికాం సంస్థల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ మృతిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు...!

■ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనవసర ఆరోపణలు మానుకోవాలి!

■ హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు!

■ శవ రాజకీయాలు మానుకోవాలి...!

■ మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు !

**హుస్నాబాద్ జూన్ 25 :**

హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మహ్మదాపూర్ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ మృతి నేపథ్యంలో కొందరు రాజకీయ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేస్తున్న ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు బాధా కరమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ మృతి దురదృష్టకర సంఘటన అని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. అయితే ఈ విషాద ఘటనను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం



ఉపయోగించుకోవడం సరైంది కాదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని, అలాంటి నాయకుడిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టించినప్పటికీ సర్పంచులకు రావాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించలేదని ఆరోపించారు. అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, అర్హులైన వారికి నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. పిట్టల సంపత్ మృతి విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయనకు సంబంధించిన బిల్లులు, అలాగే ఇతర మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారని వెల్లడించారు. అయితే కొందరు నాయకులు సంపత్ శవయాత్రను రాజకీయ వేదికగా మార్చుకొని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం, బురద జల్లే ప్రయత్నాలు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన నాయకులు విషాద ఘటనలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం తగదన్నారు. కుటుంబానికి న్యాయం చేయడంపై దృష్టి పెట్టాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక కొందరు పరాయి నాయకులు ఉద్దేశపూర్వకంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇకపై ఇలాంటి నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాస్వామ్యబద్ధంగా తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతుగంటి బాలయ్య, రిక్కల రాజిరెడ్డి, వేల్పుల సంపత్, భూక్య రమేష్ నాయక్, సంఘ శ్రీధర్, గాలిపల్లి శ్రీనివాస్, బెజ్జంకి బాబు, మామిడి తిరుపతి, గాజుల చంద్రయ్య, పంపర సంపత్, కాటం శ్రీనివాస్, లావుడియా తిరుపతి నాయక్, కొడముంజ మహేందర్,తాళ్లపల్లి రణధీర్ గౌడ్, కార్యకర్తలు, గ్రామ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో అధికమవుతున్న టైప్ 2 డయాబెటిస్ సమస్య.. హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు..

పిల్లల్లో ఒకప్పుడు చాలా అరుదుగా కనిపించిన టైప్–2 మధుమేహం ఇప్పుడు వేగంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యగా మారుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం శారీరక చలనం తగ్గడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు పెరగడం, ఊబకాయం అధికమవడం తదితర జీవనశైలి మార్పులు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. చిన్న వయసులోనే మధుమేహం రావడం వల్ల తక్షణ ఆరోగ్య సమస్యలతోపాటు భవిష్యత్తులో గుండె, మూత్రపిండాలు, నరాలు, కంటి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. టైప్–2 మధుమేహం కేవలం చక్కెర ఎక్కువగా తినడం వల్లే వస్తుందని చాలామంది భావిస్తారు. అయితే అసలు సమస్య అది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పిల్లల ఆహారంలో అధిక కార్బోహైడ్రేట్లు, తక్కువ ఫైబర్, తక్కువ ప్రోటీన్ ఉన్నప్పుడు ఆ ఆహారం చివరికి గ్లూకోజ్‌గా మారి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. దీంతో కాలక్రమేణా మధుమేహం ప్రమాదం పెరుగుతుంది. ప్యాకేజ్డ్ ఫుడ్స్ అనారోగ్యకరం..మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, పిల్లలు తీసుకునే అనేక ప్యాకేజ్డ్ ఆహారాల్లో దాగి ఉన్న చక్కెరలు. ఆరోగ్యకరమని ప్రచారం చేసే ఫ్లేవర్డ్ యోగర్ట్‌లు, బ్రేక్‌ఫాస్ట్ సిరియల్స్, ప్యాకేజ్డ్ మిల్క్‌షేక్స్, బిస్కెట్లు, కెచప్ వంటి ఉత్పత్తుల్లో కూడా గణనీయమైన మోతాదులో చక్కెర ఉంటుంది. దీంతో పిల్లలు తెలియకుండానే వారి శరీరం భరించగల సామర్థ్యాన్ని మించి గ్లూకోజ్‌ను తీసుకుంటున్నారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాదు, పిల్లల మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తాయి. తరచూ ప్రాసెస్డ్ ఫుడ్స్, తీపి పదార్థాలు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి మళ్లీ తగ్గిపోతుంటాయి. ఈ హెచ్చుతగ్గులు పిల్లల్లో చిరాకు, అసహనం, అతిచురుకుదనం, ఏకాగ్రత లోపం వంటి సమస్యలకు దారితీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే..పిల్లల్లో టైప్–2 మధుమేహం ప్రారంభ దశలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అధిక దాహం వేయడం, తరచూ మూత్ర విసర్జనకు వెళ్లడం, అసాధారణ అలసట, చూపు మసకబారడం, చిన్న



గాయాలు నెమ్మదిగా మానడం, తరచూ ఆకలి వేయడం వంటి సంకేతాలను తల్లిదండ్రులు గమనించాలి. ముఖ్యంగా మెడ, చంకల చుట్టూ నల్లని మచ్చలు కనిపిస్తే అది ఇన్సులిన్ నిరోధకతకు సంకేతం అవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ సమస్యను నివారించడానికి పిల్లల ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకురావడం అత్యంత అవసరం. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను ప్రోత్సహించాలి. తీపి పానీయాలు, జంక్ ఫుడ్, అధిక చక్కెర కలిగిన స్నాక్స్ వినియోగాన్ని పరిమితం చేయాలి. సమతుల ఆహారంలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకర కొవ్వులు ఉండేలా చూడాలి. శారీరక చలనం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పిల్లలు రోజుకు కనీసం ఒక గంటపాటు శారీరక వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రీడలు ఆడటం, సైకిల్ తొక్కడం, నృత్యం చేయడం లేదా కుటుంబ సభ్యులతో కలిసి నడకకు వెళ్లడం వంటి కార్యకలాపాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.శారీరక చలనం ఉండాలి.. స్క్రీన్ టైమ్‌ను నియంత్రించడం కూడా అవసరం. టెలివిజన్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల ముందు ఎక్కువ సమయం గడపకుండా చూసి, బయట ఆటలు ఆడేందుకు పిల్లలను ప్రోత్సహించాలి. ఇది శారీరక చలనాన్ని పెంచడమే కాకుండా ఊబకాయం ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మధుమేహానికి దారితీసే ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించవచ్చు. అలాగే పిల్లలకు చిన్నప్పటి నుంచే సమతుల ఆహారం, ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం అవసరం. నిపుణుల అభిప్రాయం ప్రకారం మధుమేహం సమస్య కేవలం చక్కెర డబ్బాతో ప్రారంభం కాదు. శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, ప్రాసెస్డ్ ఆహారాలు, దాగి ఉన్న చక్కెరలు అధికంగా ఉండే బాల్య ఆహార విధానమే అసలు ప్రమాదం.

# జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడిగా నునావత్ మోహన్ నాయక్!

■ అక్కన్నపేటకు దక్కిన కీలక పదవి, నాయకులు, కార్యకర్తల హర్షం!



**హుస్నాబాద్ జూన్ 25 :** భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షునిగా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన నునావత్ మోహన్ నాయక్ నియమితు లయ్యారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు మార్గదర్శకత్వంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ సిఫార్సుతో రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు నేనావత్ రవికుమార్ ఈ నియామకాన్ని ప్రకటించారు. నియామకానంతరం మోహన్ నాయక్‌ను అక్కన్నపేట మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నునావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ, తనకు పార్టీ అప్పగించిన



బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు జిల్లాలో గిరిజన మోర్చాను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. పార్టీ విస్తరణ, బూత్ స్థాయి నుంచి సంస్థాగత బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి తదితర నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, ఉపసర్పంచ్ అర్జున్ నాయక్, మాజీ సర్పంచులు మాలోత్ రాజ్‌కుమార్, సిహెచ్. కుమార్, మాజీ ఉపసర్పంచ్ వేముల ప్రసాద్, మహిళా మోర్చా నాయకులు మెడబోయిన స్వరూప స్వామి, కుంట సప్నారెడ్డి, నాయకులు జన్నారం కళ్యాణ్, కొండ్ల సంజీవరెడ్డి, రైనా నాయక్, పల్లె ప్రభాకర్ రెడ్డి, బొంకూరి రజనీకాంత్, జంగాపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ టీ వర్సెస్ బ్లాక్ టీ.. రెండింటిలో ఏది ఎక్కువ మేలు చేస్తుంది.. ఎవరు దేన్ని తాగాలి..?

ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాల్లో టీ ఒకటి. భారత్‌లో ఉదయం, సాయంత్రం టీ తాగడం చాలామందికి రోజువారీ అలవాటుగా మారింది. అందుబాటులో ఉన్న అనేక రకాల టీలలో గ్రీన్ టీ, బ్లాక్ టీ ఎక్కువగా వినియోగంలో ఉన్నాయి. ఈ రెండూ కామెలియా సినెన్సిస్ అనే మొక్క ఆకుల నుంచి తయారవుతున్నప్పటికీ, తయారీ విధానంలో ఉండే తేడాల కారణంగా వాటి రుచి, రంగు, ఆరోగ్య ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయి. గ్రీన్ టీ ప్రాసెసింగ్ సమయంలో ఆక్సీకరణకు గురికాకుండా ఉండటంతో ఇందులో క్యాటెకిన్స్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు అధికంగా నిల్వ ఉంటాయి. ముఖ్యంగా ఈజీసీజీ అనే సమ్మేళనం జీవక్రియల ఆరోగ్యానికి, రక్తంలో చక్కెర నియంత్రణకు ఉపయోగపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మరోవైపు బ్లాక్ టీ పూర్తిగా ఆక్సీకరణకు గురవుతుంది. ఈ ప్రక్రియలో క్యాటెకిన్స్ థియాఫ్లావిన్స్, థియారుబిజిన్స్‌గా మారి గుండె ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు ప్రత్యేక ప్రయోజనాలు అందిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లకు నిలయం గ్రీన్ టీ..గ్రీన్ టీని యాంటీ ఆక్సిడెంట్లకు మంచి వనరుగా పరిగణిస్తారు. ఇవి శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో, వాపులను నియంత్రించడంలో, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. గ్రీన్ టీ తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడటం, కొవ్వు కరిగే ప్రక్రియ వేగవంతం కావడం, గుండె జబ్బుల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రీన్ టీలో ఉండే ఎల్–థియానిన్ అనే అమినో ఆమ్లం మనసుకు ప్రశాంతతను కలిగించడంతోపాటు ఏకాగ్రతను కూడా పెంచుతుంది. అలాగే ఈజీసీజీ కొవ్వు ఆక్సీకరణను పెంచి, పిండి పదార్థాల జీర్ణక్రియలో పాల్గొనే కొన్ని ఎంజైమ్‌లను నిరోధించడం ద్వారా భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా సహాయపడుతుంది. ఫ్రీ రాడికల్స్‌ను నిర్వీర్యం చేసి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడటంలో, కణాల వృద్ధాప్యాన్ని మందగించడంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేసే బ్లాక్ టీ..బ్లాక్ టీ గ్రీన్ టీ కంటే ఎక్కువ ఆక్సీకరణకు గురవుతుంది కాబట్టి దాని రంగు ముదురు గోధుమరంగులో ఉండి రుచి మరింత గాఢంగా ఉంటుంది. ఇందులో ఉండే థియాఫ్లావిన్స్, థియారుబిజిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పరిశోధనల ప్రకారం బ్లాక్ టీ జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం, రక్తనాళాల పనితీరును మెరుగుపరచడం ద్వారా గుండె ఆరోగ్యానికి



మద్దతు ఇస్తుంది. బ్లాక్ టీలో కెఫీన్ పరిమాణం గ్రీన్ టీ కంటే కొంత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది త్వరగా శక్తిని అందిస్తుంది. కాఫీకి ప్రత్యామ్నాయంగా బలమైన పానీయం కోరుకునేవారికి బ్లాక్ టీని మంచి ఎంపికగా భావిస్తారు. అయితే ఈ రెండు టీలకు కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. గ్రీన్ టీలోని క్యాటెకిన్స్ మొక్కల ఆధారిత ఐరన్ శోషణను తగ్గించే అవకాశాలు ఉంటాయి. అలాగే టానిన్లు లేదా కెఫిన్‌కు సున్నితంగా స్పందించే వ్యక్తుల్లో జీర్ణాశయ అసౌకర్యం కలిగించే అవకాశం ఉంటుంది. దేన్ని తాగాలి..బ్లాక్ టీని అధికంగా తీసుకుంటే ఆందోళన, నిద్రలేమి, యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. గ్రీన్ టీ మాదిరిగానే ఇది కూడా ఐరన్ శోషణను కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఏ టీ ఆరోగ్యకరమనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండదు. వ్యక్తిగత ఆరోగ్య లక్ష్యాల ఆధారంగా ఎంపిక మారుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణ, టైప్–2 మధుమేహం ప్రమాదాన్ని తగ్గించడం, అధిక యాంటీ ఆక్సిడెంట్లు పొందడం లేదా ప్రశాంతతతో కూడిన పానీయం కోరుకునేవారికి గ్రీన్ టీ అనుకూలంగా ఉంటుంది. మరోవైపు కాఫీకి ప్రత్యామ్నాయంగా శక్తినిచ్చే పానీయం కావాలనుకునేవారు, గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టేవారు, జీర్ణవ్యవస్థకు మద్దతు కోరుకునేవారు లేదా గాఢమైన రుచిని ఇష్టపడేవారు బ్లాక్ టీని ఎంచుకోవచ్చు. గ్రీన్ టీ, బ్లాక్ టీ రెండింటికీ ప్రత్యేక ప్రయోజనాలు ఉంటాయి. పరిమిత మోతాదులో వీటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసుకోవడం భాగంగా చేర్చడం ద్వారా మరిన్ని తెలియజేస్తున్నారు.

# ఎస్సీ దళితులపై జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకోవడానికి వచ్చిన ఎస్సీ - ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

**సూర్యాపేట జిల్లా, మఠంపల్లి : జూన్ 25, :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో గత మే1న మండల కేంద్రంలో జరిగిన గొడవలో తన కుమారుడిపై కత్తులు, బీరు సీసాలతో దాడిచేసి చెట్లపొదల్లో పడవేసి వెళ్లిపోయారని, నిందితులపై హత్యాయత్నాం కేసు నమోదు చేయ్యలేదని . పైగా సంఘటనను చూసిన సాక్ష్యులు, తన కుమారుడిపై హత్యా యత్నం కేసు నమోదు చేశారని ఎస్సీ, ఎస్టీ కమిషనన్ ను కలిసి ఫిర్యాదు చేసిన అంశంపై వివరాలు తెలుసుకునేందుకు తాము వచ్చామని దళితులపై జరిగిన దాడులు,నంద మహేష్ పై జరిగిన దాడికి సంబంధించి జరిగిన పరిస్థితులను తెలుసుకోవడానికి, ఒక నిజనిర్ధారణ కమిటీ తరపున తాము ఇక్కడికి వచ్చినట్లు కావాలని పోలీసు వాళ్ళు ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు కట్టి అమాయకులపై జైలు శిక్ష విధించడం. సరైన పద్ధతి కాదని. కావాలనే దళితులు ఇచ్చిన పిటిషన్ లో కొంతమంది పేరు తొలగించి. వారికి ఇష్టం వచ్చినట్లు కేసు రాసుకొని వారికి





నచ్చినట్లు వారికి నచ్చిన వ్యక్తులు కేసులు కట్టడం సరికాదని. ఇప్పటి వరకు కూడా అందరిని రిమాండ్ చేయకపోవడం. పోలీస్ వ్యవస్థ పై నమ్మకం పోతుందని. దళితులపైనే కావాలని దాడులు చేస్తున్నారని స్థానిక మంత్రి నియోజకవర్గంలో దళితులు బతకకూడదా దళితులకు మీరు ఇచ్చే రక్షణ ఇదేనా అంటూ మొన్న కర్ల రాజేష్ లాక్ అప్ డెత్,ఇప్పుడు మఠంపల్లిలో ప్రాణాలు తీసేంత దాడికి పాల్పడడం సరికాదని తప్పు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ వ్యక్తులపై పెట్టిన ఫేక్ కంప్లైంట్ వెనక్కు తీసుకోవాలని, ఎలాంటి కేసులు లేకుండా సహకరించాలని, దళితులపై దాడులు చేసే వారిని గుర్తించి అందరిపై చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. ఎస్సీ - ఎస్టీ దళిత ప్రజలకు ఎస్సీ - ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎల్లప్పుడు తోడు ఉంటుందని ఈ కేసులో బాధితులకు న్యాయం జ రిగేంతవరకు పోరాడుతాము అన్నారు. వీరితో పాటు బాధిత కుటుంబాల తల్లిదండ్రులు.కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద రైతు భూమిపై కన్నేసిన చిన్న గుడిపేట వాసి పై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని సూరం భీమయ్య కుటుంబం...

**ఉమ్మడి ఆదిలాబాద్ :జూన్ 25, :** మాంచెరియల్ జిల్లా చిన్నగూడి పేట గ్రామం భీమిని మండలం కుచెందిన సూరం బీమయ్య కుటుంబికులు మీడియాను ఆశ్రయించి మాట్లాడుతూ తమకు చెందవాల్సిన భూమి వేరే వారికి పట్టా చేసారని చిన్న గుడి పేట గ్రామానికి చెందినసూరం బీమయ్య కుటుంబికులు తహసీల్దార్,,పోలీస్ స్టేషన్ కు పిర్యాదు చేశారు. సూరం బీమయ్య గ్రామ సమీపనగల భూమి సర్వే నంబర్ 264,,,(8..24)ఎకరాలు భూమిని మరొ కరికి పట్టా చేశారని వారు ఆరోపించారు. తాము 50సంవత్స రాలనుండి కాస్తులో ఉన్నామని, సాగుచేస్తూ జీవిసనోపాధి గడుపుచున్నామని, సూరం బీమయ్య వృద్యాప్యంతో మంచానికి పరిమితమై ఉన్నారని, బీమయ్య కూతురి కుమారుడు ఎటకారి రాజు గత 10సంవత్సరాలనుండి కష్టసుఖాలు చూసుకుం టున్న మని, కుమారుడున్న, తండ్రి మంచానికి పరిమితి ఐన కష్ట శుఖాలు చూడడం లేదని, తాతాను అన్ని విధాలుగా చూసుకుం టానన్ని



తెలిపారు.ఏది ఏమైనా సురం బిమయ్య భూమి ఎట్టి పరిస్థితిలోవదలం, ప్రాణాలు పోయిన పర్వాలేదు, మాకు అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని, పట్టాను రద్దు చేసి, ఎవరైతే పట్టాను ఏ విదంగా చేసారో ఆ అధికారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోని న్యాయం చేయాలనీ ,కుటుంబికులు వేడుకొంటున్నారు.పట్టాదారుని చరవాణిద్వారా వివరణ కోరగా నేనుభూమి కొనుగోలు సమయంలో కుటుంబికులకు సమాచారం ఇచ్చానని వారు ఎలాంటి అభ్యతంతర వ్యక్తం చేయనందున, పట్టాదారుడు మంథిని గ్రామస్తులవద్ద సూరం బీమయ్య కుమారుడైన పోషన్న ఆధ్వర్యంలో గత సంవత్సరములో భూమి కోని పట్టా చేసుకున్నని నాకు వారికి సంబంధం లేదని నన్ను భూమిలో వెళితే అడ్డుకుంట ున్నారని,,పత్తి విత్తనాలు వేసానని తెలిపారు. ఇట్టి సమస్యపై స్థానికులను విచారించగా గత 50సంవత్సరాలనుండి సూరం బీమయ్య సాగు చెస్తూ జీవనం సాగిస్తు, కుటుంబ పోషణ చెసుకుంటున్నారని తెలిపారు. ఇట్టి భూమి పై నల్గురు పట్టాదారులు మారారని ఎవరు కూడా మొఖా పై రాలేదని, సూరం బీమయ్యకుటుంబకులు సాగుచేస్తున్నరని తెలిపారు .ప్రస్తుతం బీమయ్య మంచానికే పరిమితై ఉన్నారని తెలిపారు. భూముల పట్టాల వల్ల నిరుపేదలకు శాపంగా మారా యాని న్నారు. ఇరువర్గాలు అధికారులకు న్యాయం చేయండి అంటూ వేడుకొంటున్నారు.

# ఒకవైపు తీవ్ర నీటి ఎద్దడి.. మరోవైపు వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

**-అరకొరగా వస్తున్న నీరైనా వృథా అవుతున్నా పట్టించుకోని వైనం...**

**-ధ్వంసమవుతున్న ప్రధాన రహదారి.....**

**చెన్నారావుపేట, జూన్ 25 :** వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం పరిధిలోని కాల్ నాయక్ తండాలో ఒకవైపు నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతుంటే...మరోవైపు అమూల్యమైన మిషన్ భగీరథ నీరు రోడ్లపాలు అవుతోంది. కళ్లముందే నీరంతా వృథాగా పోతున్నా, గ్రామపంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై తండావాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని నెలలుగా కాల్ నాయక్ తండాలో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. స్థానిక మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు సరిగ్గా అందకపోవడంతో, అధికారులు ప్రత్యామ్నాయంగా నేరుగా గ్రామానికి వెళ్లే ప్రధాన పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇచ్చారు.గతంలోనే అక్కడక్కడా ట్యాంక్ నుండి గ్రామానికి వెళ్లే పైప్‌లైన్ లీకేజీ ఉంది, మరమ్మత్తు పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారు.పైపుల నుంచి భారీ మొత్తంలో నీరు లీకై, రోడ్డుపైకి ప్రవహిస్తోంది.పైప్‌లైన్ లీకేజీ



కారణంగా కేవలం నీరు వృథా అవ్వడమే కాకుండా, తండాకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. నిరంతరం నీరు నిలిచి ఉండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీనివల్ల తండావాసులతో పాటు, ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### ■ అధికారులు తక్షణమే స్పందించి పైప్ లైన్ లీకేజీలపై మరమ్మత్తు పనులు చేపట్టాలి

కాల్ నాయక్ తండాలో తక్షణమే పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.తండాకు నిరంతరాయంగా నీటి సౌకర్యం అందేలా చూడాలని, దెబ్బతిన్న రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

### ■ సమస్యపై మండల ఏఈఈ వివరణ

మిషన్ భగీరథ ట్యాంక్ నుండి గ్రామానికి వెళ్లే ప్రధాన పైప్లైన్ లీకేజ్ గుర్తైనట్లు స్థానిక అధికారుల నివేదికతో గుర్తించడం జరిగిందని, స్థానిక గ్రామపంచాయతీ అధికారులకు పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించడం జరిగిందని, వెంటనే సమస్యను పరిష్కరించి గ్రామానికి నిరంతరం నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

# ఆర్టీఐ అమలులో లోపాలు బట్టబయలు

- **17 నెలలుగా సమాచారం కోసం పోరాటం...**
- **బాధ్యులపై చర్యలు, జరిమానా విధించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి**

**కొణిజర్ల : జూన్ 25 :**ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలనే లక్ష్యంతో అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో ఉన్న లోపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. కొణిజర్ల గ్రామ పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని కోరిన ఒక దరఖాస్తుదారు దాదాపు 17 నెలలుగా పూర్తి సమాచారం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఆర్టీఐ చట్టం అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.సీసీఆర్ కార్యకర్త ఎస్.కె. నాగుల్ షరీఫ్ తన ఇంటికి విధించిన రూ.10,739 ఇంటి పన్నుకు సంబంధించిన పూర్తి వివరాలను కోరుతూ 2025 జనవరి 15న సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు సమర్పించారు. చట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాల్సి ఉండగా, అధికారులు నిర్ణీత గడువులో స్పందించలేదు. అనంతరం అందించిన సమాచారం కూడా అసంపూర్ణంగా ఉండటంతో ఆయన మొదటి అప్పీల్‌కు వెళ్లారు. అక్కడ కూడా పూర్తి సమాచారం అందకపోవడంతో తెలంగాణ సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు.ఈ కేసుతో పాటు మరో కేసుపై కూడా జూన్ 24న సమాచార కమిషన్ ఎదుట విచారణ జరిగింది. మొదటి విచారణ సందర్భంగా కమిషనర్ పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులను ఆదేశిస్తూ వాయిదా ఇచ్చారు. అయితే రెండోసారి కూడా అధికారులు పూర్తి రికార్డులు సమర్పించకపోవడం గమనార్హం. ఇంటి పన్ను విధింపులో పొరపాటు జరిగిందని అంగీకరించినప్పటికీ, ఆర్టీఐ దరఖాస్తులో కోరిన ఇతర ముఖ్యమైన వివరాలను మాత్రం అందించలేకపోయారు.ఈ సందర్భంగా కమిషన్ ఎదుట ఎస్.కె. నాగుల్ షరీఫ్ తన వాదనలు వినిపిస్తూ, 2025 జనవరి 15 నుంచి ఇప్పటివరకు సమాచారం కోసం కార్యాలయాల చుట్టూ



తిరుగుతున్నానని, అధికారులు చట్టబద్ధంగా అందించాల్సిన సమాచారాన్ని ఇవ్వకుండా తనను ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు పలుమార్లు ప్రయాణించి విచారణలకు హాజరుకావాల్సి రావడం వల్ల అనవసర ఖర్చులు, సమయ నష్టం ఎదురైందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.సమాచార హక్కు చట్టం సెక్షన్-20 ప్రకారం సమాచారం ఇవ్వడంలో జాప్యం చేసినా, కావాలనే సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించే అవకాశం ఉందని గుర్తుచేస్తూ, ఈ కేసులో బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిసింది. అంతేకాకుండా, తనకు ఇప్పటికీ పూర్తి సమాచారం అందించని అధికారులపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.వరుసగా రెండు విచారణల్లోనూ పూర్తి సమాచారం సమర్పించకపోవడం, కమిషన్ ఆదేశాల అనంతరం కూడా నిర్లక్ష్య వైఖరి కొనసాగడం పట్ల పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక సాధారణ పౌరుడు చట్టబద్ధమైన సమాచారాన్ని పొందేందుకు నెలల తరబడి పోరాడాల్సి రావడం ఆర్టీఐ చట్టం అమలులో ఉన్న లోపాలను స్పష్టంగా చూపుతోందని పరిశీలకులు అభిప్రాయప డుతున్నారు. ప్రజాస్వామ్యంలో సమాచార హక్కు ఒక కీలక ప్రజా సాధనం. ఆ హక్కును కాలయాపన, నిర్లక్ష్యంతో నిర్వీర్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే చట్టంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఆర్టీఐ కార్యకర్తలు పేర్కొంటున్నారు. కమిషన్ ఆదేశాల అమలుపై మరింత కఠిన పర్యవేక్షణ ఉండాలని, బాధ్యులపై జరిమానాలు విధించి జవాబుదారీతనం పెంచాలని వారు కోరుతున్నారు.అయితే ఈ కేసులో సమాచార కమిషన్ ఇంకా తుది ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు నమోదు చేసిన కమిషనర్, కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం తదుపరి ఆదేశాలు వెలువరించే అవకాశం ఉందని తెలుస్తోంది. సమాచారం అందించడంలో జరిగిన జాప్యం, కమిషన్ ఆదేశాల అమలులో అధికారుల వైఖరి, దరఖాస్తుదారు చేసిన ఫిర్యాదులపై కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# సలుగుపల్లి నుండి పెంచికల్ పేట్ వరకు రోడ్డు అంత గుంతలమయం,అద్వానం

- **నరకాయతన పడుతున్నప్రజలు, వాహనదారులు....**
- **నిద్రమత్తులో ప్రభుత్వాలు, పాలకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు..**
- **సిర్పూర్ సమస్యల కు నిలయం.... నాయకులనిర్లక్ష్యం....**



**కొమరంబీమ్ ఆసిఫాబాద్ :జూన్ 25 :**కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లాతెలంగాణ రాష్ట్రం లో,సిర్పూర్ నియోజకవర్గం 001,గా ఉన్న అభివృద్ధిలో 000గానే ఉందని, స్వాతం త్రము వచ్చి 79సంవత్సరాలైన సిర్పూర్ నియోజకవర్గంలో కనీసం బస్టాండ్ (ప్రయాణికులు ప్రాంగణం) లేదని, సమస్యలు పట్టించుకొనే నాదులు కరువు, వారే అభివృద్ధి తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోరు..ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వాలు పాలకులు మారిన సలుగుపల్లి నుండి పెంచికల్ పేట్ ప్రధాన రహదారి గత సంవత్సరాలనుండి రోడ్డు అంత గుంతలు పడి అద్వానంగా ఉన్న ప్రజలు నరకాయతన పడుతున్నఏ ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. నిత్యంవందల సంఖ్యలో వాహనాలు నడుస్తున్నాయని, ఇదే రహదారి గుండా ఉన్నత అధికారులు,పాలకులు వెళ్లిన చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని అధికారులపై, ప్రభుత్వాలపై, నాయకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చెస్తున్నారు ఏది ఏమైనా సలుగుపల్లి నుండి పెంచికల్ పేట్ వరకు గలప్రధాన పూర్తిగా రోడ్డు గుంతలమాయంగా మారిందని, గుంతలలో నీళ్లు నిల్వ,దింతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి. కేవలం 10కిలోమీటర్ ప్రయాణించటానికి గంటన్నర సమయం పడుతుందని ఆర్టీసీ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలంలో మరింత దారుణంగా తయారు అవుతుందని, వెంటనే అధికారులు స్పందించి రోడ్డు ను మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

# కొత్త పట్టదారులు వానకాలం రైతు భరోసా పథకం కి దరఖాస్తు చేసుకోగలరు

**ఓదెల : జూన్ 25 :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు వానకాలం 2026 పంటల సాగు కు పెట్టుబడి సహాయం రైతు భరోసా పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ప్రకటన లో తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ మండలం లో కొత్తగా 117 పట్టా పాస్ పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. రైతులు ఆ గ్రామ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కావలసిన పత్రాలు:1) కొత్త పాస్ బుక్ లేదా డిజిటల్ సంతకం అయిన భూ భారతి ఆన్లైన్ కాపీ నకలు2) బ్యాంకు పాస్ పుస్తకం 3) ఆధార్ కార్డు
4) దరఖాస్తు ఫారంగతం లో రైతు భరోసా పథకం లబ్ది పొందే వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఏమైనా బ్యాంకు ఖాతాలు మార్చుకోవాలి అనుకునే వారు ఏ ఈ ఓ లను సంప్రదించాలని కోరారు.



# తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శారద



**వరంగల్ జిల్లా : జూన్ 25** ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ “ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వరంగల్ మండలం పైడిపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సం దర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను కూలంకషంగా పరిశీలిస్తూ నిర్మాణంలో వాడుతున్న సిమెంట్ గ్రేడ్, ఇనుము నాణ్యత, ఇటుకల ధృఢత్వం గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరాలను, ఎంత శాతం పూర్తయ్యాయి, మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి అనే అంశంపై కాంట్రాక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ వర్షాకాల పరిస్థితుల వల్ల నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సిమెంట్ సెట్టింగ్, కురిసే వర్షం వల్ల మట్టి పని ఆలస్యం వంటి అంశాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పని చేయాలి అని వారు అన్నారు. గడువులోగా నాణ్యమైన భవనం నిర్మించి విద్యార్థులకు అందజేయాలి అని కలెక్టర్ అధికారులను కోరారు.ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల ఉచ్చులో పడోద్దు : టౌన్ ఏసీపీ రమణమూర్తి




**ఖమ్మం అర్బన్ : జూన్ 25,** మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. జూన్ 26 న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా జైలు లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో టౌన్ ఏసీపీ పాల్గొని మాట్లాడుతూ..ఖైదీలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలు వాటి నుంచి విముక్తి పొందే మార్గాలపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. జైలు జీవితం నుండి బయటపడిన తర్వాత వారు ఆరోగ్యకరమైన, నేరరహిత జీవితాన్ని గడపడానికి కౌన్సెలింగ్ అవసరమన్నారు. ముఖ్యంగా చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే అనేక రుగ్మతల భారిన పడతారన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ పై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం, సరఫరా చేయడం, తయారీ, క్రయవిక్రయాలు అన్నీ క్రిమినల్ నేరాలని.. కఠినశిక్షలు తప్పవని సూచించారు.మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వాళ్లు వాటి నుంచి విముక్తి కోసం స్వయంగా ముందుకు వస్తే వారిపై ఎలాంటి నేర విచారణా ఉండదన్నారు. ఉచితంగా వైద్య సహాయం అంది స్తామన్నారు.కార్యక్రమంలో జైలు సూపరిండెంట్ శ్రీధర్, ఇన్స్పెక్టర్ భానుప్రకాష్, జైలర్ సక్రూ, తదితరులు పాల్గొన్నారు.

# వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్



భారత సీనియర్ క్రికెట్ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల ఓపెనింగ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రానికి ముందే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. త్వరలో జరగబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్న ఈ టీనేజ్ స్టార్, బ్రిటన్ పర్యటనలో ఒక వింతైన పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. అతను మైనర్ (చిన్నపిల్లవాడు) కావడంతో అక్కడి 'మైనర్ల రక్షణ నిబంధనల' ( ప్రకారం అతనికి పర్యటన పొడవునా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. యునైటెడ్ కింగ్‌డమ్ క్రికెట్ నిబంధనల ప్రకారం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని 'అండర్-16' ఆటగాడిగా (మైనర్‌గా) పరిగణిస్తారు, పెద్దవాడిగా కాదు. బ్రిటన్ చట్టాల ప్రకారం మైనర్లయిన ఆటగాళ్లు వయసులో పెద్దవారైన మిగతా జట్టు సభ్యులతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లను గానీ, షవర్ (స్నానపు) గదులను గానీ పంచుకోవడానికి వీల్లేదు. ఇది ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యొక్క భద్రతా ఫ్రేమ్‌వర్క్‌లో ఒక భాగం. 16 ఏళ్ల లోపు ఉన్న ఆటగాళ్లు పెద్దలతో కలిసి ఒకే డ్రెస్సింగ్ రూమ్ వాడటాన్ని ఇది నిషేధిస్తుంది. స్వతంత్ర క్రికెట్ నియంత్రణ సంస్థ తో పాటు మ్యాచ్‌లు జరిగే స్టేడియాల సేఫ్‌గార్డింగ్ అధికారులు ఈ నియమాలను పర్యవేక్షిస్తారు. ఈ ఆంక్షలు ఉన్నప్పటికీ, వైభవ్ సూర్యవంశీ జట్టులోని మిగతా సభ్యులతో కలిసి టీమ్ మీటింగ్‌లు, వ్యూహాత్మక చర్చలు, వార్మ్-అప్ సెషన్లు, మ్యాచ్ రోజున జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ సాధారణంగానే పాల్గొంటాడు. ఈ పరిమితులు కేవలం మ్యాచ్ దుస్తులు మార్చుకునేటప్పుడు లేదా షవర్ ఉపయోగించేటప్పుడు మాత్రమే వర్తిస్తాయి. ఆ సమయంలో అతనికి కేటాయించిన ప్రత్యేక ప్రైవేట్ గదిని ఉపయోగించాలి. ఒకవేళ ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను ఉపయోగించాల్సి వస్తే, మిగతా ఆటగాళ్లు ఎవరూ లేని సమయంలో నిర్దేశిత టైంలో మాత్రమే అతనికి అనుమతి ఉంటుంది. భారత్-ఇంగ్లాండ్ సిరీస్ అనేది రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కానీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్ కాదు. కాబట్టి ఈ విషయంలో ఐసీసీకి ఎలాంటి అధికారం ఉండదని నివేదికలు స్పష్టం చేశాయి. "ఈ సేఫ్‌గార్డింగ్ నిబంధనలు ద్వైపాక్షిక సిరీస్‌లకు వర్తించవు. భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ సిరీస్ ఐసీసీ ఈవెంట్ కాదు కాబట్టి అండర్-16 క్రికెటర్ల కోసం ప్రత్యేక ఐసీసీ రూల్స్ ఏవీ లేవు. ఇది పూర్తిగా యూకే దేశ చట్టం, ఇందులో ఐసీసీ జోక్యం చేసుకోలేదు" అని హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ఒక అధికారిక ప్రతినిధి మాటలను ఉటంకించింది. భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇదే రకమైన నిబంధనలను పాటిస్తామని 'క్రికెట్ ఐర్లాండ్' స్పష్టం చేసింది. క్రికెట్ ఐర్లాండ్ ప్రతినిధి మాట్లాడుతూ.. "పెవిలియన్‌లో భారత జట్టు కోసం మూడు విడివిడి గదులను కేటాయించాం, అలాగే సేఫ్‌గార్డింగ్ చట్టాల గురించి వారికి వివరించాం. నిబంధనలన్నీ సక్రమంగా అమలు జరిగేలా మేము పర్యవేక్షిస్తాం, అయితే బీసీసీఐ కూడా యూకే చట్టాల ప్రకారం ఈ విషయాలను హ్యాండిల్ చేస్తుంది. మా విధానాలు బ్రిటన్ లోని ఉత్తమ పద్ధతులకు అనుగుణంగానే ఉన్నాయి" అని తెలిపారు. ఏదేమైనా ఒక అంతర్జాతీయ పర్యటనలో ఒక భారత ఆటగాడి కోసం ఇలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం క్రికెట్ చరిత్రలో చాలా అరుదైన విషయమనే చెప్పాలి.

# మెస్సీ పేరు వినగానే అసహనం!



ఫిఫా వరల్డ్ కప్ 2026లో పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో సరికొత్త రికార్డులతో దూసుకుపోతున్నాడు. ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 5-0 తేడాతో ఘనవిజయం సాధించగా.. రొనాల్డో రెండు అద్భుతమైన గోల్స్ చేశాడు. ఈ గోల్స్‌తో ఆరు వేర్వేరు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ప్రపంచంలోనే ఏకైక ఆటగాడిగా క్రిస్టియానో రొనాల్డో చరిత్ర సృష్టించాడు. అంతే కాకుండా వరల్డ్ కప్‌లలో పోర్చుగల్ తరఫున అత్యధిక గోల్స్ (10) చేసిన ఆటగాడిగా కూడా రికార్డు సాధించాడు. అయితే ఈ చారిత్రాత్మక విజయం తర్వాత మీడియా సమావేశంలో చోటుచేసుకున్న ఓ సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ ముగిసిన అనంతరం 'మిక్స్‌డ్ జోన్' ఇంటర్వ్యూలో క్రిస్టియానో రొనాల్డో మీడియాతో మాట్లాడుతుండగా.. ఒక స్పానిష్ జర్నలిస్ట్ అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, కిలియన్ ఎంబాపేల గురించి ప్రశ్నించడం ప్రారంభించారు. అయితే ఆ ప్రశ్న పూర్తిగా ముగియక ముందే రొనాల్డో తీవ్ర అసహనానికి గురయ్యారు. జర్నలిస్ట్ వైపు నుంచి ముఖం తిప్పేసుకుని, పక్కనే ఉన్న మరో రిపోర్టర్ వైపు సైగ చేస్తూ తదుపరి ప్రశ్న అడగాలని కోరాడు. దీంతో సదరు రిపోర్టర్ తన ప్రశ్నను మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. నాకౌట్ రౌండ్‌లో పోర్చుగల్, అర్జెంటీనా జట్లు తలపడే అవకాశం ఉందనే అంశంపై జర్నలిస్టులు ప్రశ్నించగా.. రొనాల్డో కొంతమేర స్పందించాడు. "దీనికి ఏం సమాధానం చెప్పాలో నాకు తెలియడం లేదు. ఈ ప్రశ్నకు పెద్దగా అర్థం లేదు, కానీ ఒకవేళ ఆ మ్యాచ్ జరిగితే మాత్రం చాలా అద్భుతంగా ఉంటుంది" అని రొనాల్డో అన్నాడు. అయితే ఆ తర్వాత కూడా జర్నలిస్టులు మెస్సీ చేసిన గోల్స్ గురించి పదే పదే ప్రశ్నించడంతో రొనాల్డోకు కోపం నశాలానికి అంటింది. "నాకు ఇతరుల గురించి ఎలాంటి పట్టింపు లేదు, అక్కడ ఎంబాపే కూడా గోల్స్ చేశాడు" అని కోపంగా సమాధానమిస్తూ ఇంటర్వ్యూ మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. క్రిస్టియానో రొనాల్డో, లియోనెల్ మెస్సీల మధ్య మైదానంలో ఉన్న పంతం, పోటీ ఈనాటిది కాదు. గత రెండు దశాబ్దాలుగా వీరిద్దరిలో అత్యుత్తమ ఆటగాడు ఎవరనే అంశంపై ఫుట్‌బాల్ ప్రపంచంలో నిరంతరం చర్చ జరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2009 నుంచి 2018 మధ్య కాలంలో రొనాల్డో రియల్ మాడ్రిడ్‌కు, మెస్సీ బార్సిలోనా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ స్పానిష్ లీగ్ 'లా లిగా'లో ఆడినప్పుడు వీరి మధ్య పోటీ పీక్స్‌కు చేరింది. ఇప్పటికీ వీరిద్దరి అభిమానులు సామాజిక మాధ్యమాలలో ఒకరినొకరు ట్రోల్ చేసుకుంటూనే ఉంటారు. రొనాల్డో తాజా ప్రవర్తనతో మైదానం వెలుపల కూడా వీరి మధ్య ఉన్న రైవల్రీ మరోసారి స్పష్టమైంది.



## సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి

# నూర్ అహ్మద్

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఆటగాళ్ల బదిలీల వ్యవహారం క్రికెట్ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ పదవి నుంచి తప్పుకున్న రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్తుండటం.. బదులుగా కుల్దీప్ యాదవ్ లక్నో జట్టులోకి వస్తున్నాడనే వార్తలతో ట్రేడింగ్ మార్కెట్ ఇప్పటికే వేడెక్కింది. ఈ క్రమంలోనే సీఎస్కే స్టార్ స్పిన్నర్ ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన నూర్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి ట్రేడ్ చేయబోతున్నారంటూ ఎక్స్ వేదికగా ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న సోషల్ మీడియా పోస్టుల ప్రకారం.. సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం తమ జట్టులోకి ఓ మంచి స్పిన్నర్‌ను తీసుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే సీఎస్కే స్పిన్నర్ నూర్ అహ్మద్ ప్రదర్శన పట్ల ఆరెంజ్ ఆర్మీ యాజమాన్యం ఎంతో నమ్మకంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# శతకంతో చెలరేగిన సాయి సుదర్శన్



శ్రీలంక-ఏతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ ఓపెనర్ సాయి సుదర్శన్(175 బంతుల్లో 19 ఫోర్లతో 132) శతకంతో చెలరేగాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 4 వికెట్లకు 333 పరుగులు చేసింది.సాయి సుదర్శన్‌తో పాటు కెప్టెన్ ధ్రువ్ జురెల్(138 బంతుల్లో 5 ఫోర్లతో 68 బ్యాటింగ్), తెలుగు తేజం షేక్ రషీద్(92 బంతుల్లో 4 ఫోర్లతో 53) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక-ఏ బౌలర్లలో సుదీర రెండు వికెట్లు తీయగా.. చామిక గుణశేఖర, రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీసారు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే(25) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. ఆయుష్ పాండేను తిలకరత్నే ఔట్ చేయగా.. దేవదత్ పడిక్కల్ సాయంతో సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అయితే పడిక్కల్(12) ఎల్బీగా వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడటంతో పరుగుల వేగం తగ్గింది. మూడో వికెట్‌కు 85 పరుగులు జోడించిన అనంతరం రుతురాజ్ గైక్వాడ్(22) ఎల్బీగా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. సాయి సుదర్శన్ శతకం పూర్తి చేసుకున్నాడు. సెంచరీ అనంతరం సాయి సుదర్శన్‌ను గుణశేఖర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు.తెలుగు తేజం షేక్ రషీద్‌తో కలిసి ఆచితూచి ఆడిన ధ్రువ్ జురెల్ మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించాడు. ఈ ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోవడంతో ఐదో వికెట్‌కు అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదైంది.



# అక్షితా రాజ్‌తో ఆకాశ్ దీప్ వివాహం

భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. తన పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే పెళ్లిక హాజరైన ఓ అతిథి రోహిత్, కోహ్లి, ధోనీని ఎందుకు పిలవలేదు అంటూ అడగ్గా.. ఆకాశ్ దీప్ చమత్కారంగా సమాధానమిచ్చాడు. వారణాసికి వాళ్లు వచ్చి ఉంటే పెళ్లి ఎవరైనా జరగనిచ్చేవారా? అంటూ ఫన్నీగా చెప్పాడు. ప్రస్తుతం గాయాల భారిన పడ్డ ఆకాశ్ దీప్ జట్టులో చోటు కోల్పోయాడు.టీమిండియా పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల వారణాసిలో అంగరంగ వైభవంగా అక్షితా రాజ్‌ను వివాహం చేసుకున్నాడు. తన పెళ్లి వేడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిమానులు, టీమిండియా ఫ్యాన్స్ అందరూ ఆకాశ్‌కు కామెంట్స్ రూపంలో శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఈ వివాహానికి హాజరైన ఓ అతిథి ఆకాశ్ దీప్‌ను ఓ ఆసక్తికర ప్రశ్న అడగ్గా, అంతకంటే ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు ఆకాశ్ దీప్.విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీని వివాహానికి ఎందుకు ఆహ్వానించలేదంటూ ఒక అతిథిని ఆకాశ్ దీప్‌ను ప్రశ్నించాడు. దానికి ఆకాశ్ దీప్ సరదాగా స్పందిస్తూ వాళ్లు వస్తే ఇక్కడ వారణాసిలో పెళ్లి జరగనిస్తారా? అంటూ ఫన్నీగా జవాబిచ్చాడు. ధోనీ, విరాట్, రోహిత్ వంటి స్టార్ క్రికెటర్లు పెళ్లికి హాజరైతే భారీ సంఖ్యలో అభిమానులు తరలివస్తారు.. అప్పుడు పెళ్లి వేడుక ప్రశాంతంగా సాగదు కదా అన్న అర్థంలో ఆకాశ్ దీప్ చమత్కారంగా కామెంట్స్ చేశాడు. ఐపీఎల్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఆకాశ్ దీప్, డొమెస్టిక్ క్రికెట్‌లోనూ రాణించి టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు.

# వన్డే ప్రపంచకప్ 2027లో రో-కో ఆడాలి

**- సెలక్టర్లకు రవిచంద్రన్ అశ్విన్ సూచన**

వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడటంపై వస్తున్న పుకార్లకు రవిచంద్రన్ అశ్విన్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. వీరిద్దరిపై పనిగట్టుకుని కొందరు నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వచ్చే ప్రపంచకప్‌లో రో-కో కచ్చితంగా ఆడాలని స్పష్టం చేశాడు. అలాగే బీసీసీఐ సెలక్టర్లు కూడా వీరి భవితవ్యంపై ఇప్పుడే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే.. ఎలాంటి గందరగోళం లేకుండా వారు పూర్తి నమ్మకంతో టోర్నీకి సిద్ధమవుతారని అశ్విన్ సూచించాడు.టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు.ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. "దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. ముమ్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది. గందరగోళానికి దారి తీస్తుంది" అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.

# రోహిత్ శర్మ సక్సెస్ సీక్రెట్ ఇదే..




క్రికెట్ మైదానంలో పరుగుల వరద పారించే టీమిండియా స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ స్టైల్‌కు కోట్లాది మంది అభిమానులున్నారు. అయితే కఠోర శ్రమ, అద్భుతమైన ప్రతిభతో పాటు రోహిత్ సక్సెస్ వెనుక కొన్ని సీక్రెట్స్, నమ్మకాలు ఉన్నాయనే విషయం మీకు తెలుసా? ఆటగాళ్ల నమ్మకాలు.. హిట్‌మ్యాన్ సెంటిమెంట్లు..: క్రికెట్ ప్రపంచంలో ప్రతిభ ఎంత ముఖ్యమో.. అదృష్టం కూడా అంతే కీలకమని చాలామంది ఆటగాళ్లు నమ్ముతుంటారు. మైదానంలోకి అడుగుపెట్టే ముందు ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాటు లేదా సెంటిమెంట్ ఉంటుంది. పూర్వకాలం నుంచి నేటి తరం ఆటగాళ్ల వరకు ఏదో ఒక నమ్మకాన్ని గుడ్డిగా అనుసరిస్తూనే ఉన్నారు. మన భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇందుకు మినహాయింపు కాదు. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన రోహిత్.. ప్రతి మ్యాచ్‌కు ముందు మూడు ప్రత్యేకమైన అలవాట్లను, సెంటిమెంట్లను తూచా తప్పకుండా పాటిస్తుంటారు. కాఫీ గ్లాసుతోనే రోహిత్ రోజు షురూ..: రోహిత్ శర్మ రోజువారీ జీవితంలో కాఫీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మ్యాచ్ ఉన్న రోజు ఉదయం నిద్ర లేవగానే హిట్‌మ్యాన్ కచ్చితంగా కాఫీ గ్లాసుతోనే తన రోజును ప్రారంభిస్తారు. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల ఆ రోజంతా తనకు ఎంతో అదృష్టం కలిసివస్తుందని రోహిత్ బలంగా నమ్ముతారు. మ్యాచ్ రోజుల్లో కాఫీ తాగడానికి ముందే టీ లేదా ఎలాంటి పండ్ల రసాలను ముట్టుకోవడానికి కూడా ఆయన ఇష్టపడరు. కేవలం వేడి వేడి కాఫీ మాత్రమే తన మానసిక స్థితిని మార్చి, మైదానంలో రాణించేలా చేస్తుందని రోహిత్ సెంటిమెంట్. భార్య రితికకు ఫోన్ కాల్.. విజయానికి అసలు మంత్రం..: మైదానంలో ఎంత ఒత్తిడి ఉన్నా.. టీమ్ మీటింగ్‌కు వెళ్లే ముందు రోహిత్ శర్మ తన భార్య రితికా సజ్దేకు కచ్చితంగా ఫోన్ చేస్తారు. రితికతో మాట్లాడటం రోహిత్‌కు మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, మైదానంలో భారీ స్కోర్లు సాధించడానికి ఒక అదృశ్య శక్తిలా పనిచేస్తుందని ఆయన భావిస్తారు. సాధారణంగా రితికా సజ్దే ప్రతి మ్యాచ్‌లోనూ స్టేడియంలో కూర్చుని రోహిత్‌ను ప్రోత్సహిస్తూ కనిపిస్తుంటారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆమెతో మాట్లాడటం హిట్‌మ్యాన్ విజయ రహస్యాల్లో అత్యంత ముఖ్యమై నది. కుడికాలే ముఖ్యం.. ఒత్తిడిని జయించే రహస్యం. .: ఇక మూడవ, అత్యంత ఆసక్తికరమైన సెంటిమెంట్ ఏంటంటే.. రోహిత్ శర్మ బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎల్లప్పుడూ తన కుడికాల్ని మొదట లోపల పెడతారు. ప్రపంచ క్రికెట్‌లో చాలా మంది దిగ్గజాలు ఈ కుడికాలి సెంటిమెం ట్‌ను పాటిస్తారు. దీనితో పాటు, మైదానంలో ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు రోహిత్ స్టేడియంలో తనకు నచ్చిన ఒక నిర్దిష్టమైన స్థలాన్ని లేదా వైపును నిరంతరం చూస్తూ ఉంటారు. అలా చూడటం వల్ల తన మనసుకు ప్రశాంతత లభిస్తుందని, ఎంతటి కఠినమైన పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యం వస్తుందని రోహిత్ నమ్ముతారు.

# ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

## సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది.ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.



# మామ సినిమాకు అల్లుడు క్లాప్

## బాలకృష్ణ 112వ చిత్రానికి లోకేశ్ కెమెరా ఆన్

రాజధాని అమరావతిలో నందమూరి నటసింహం బాలకృష్ణ 112వ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సినిమా ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయ్యిందన్నారు. ఏపీలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సినిమాతో పాటు థియేటర్ ఎకనామిని ప్రోత్సహిస్తామన్నారు. ఎఐ టెక్నాలజీతో సినిమా పరిశ్రమను మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సినిమాలు అమరావతి నుంచే ప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సినీ పరిశ్రమకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

# సందీప్ కిషన్ సూపర్ సుబ్బు


టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను




నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది. దేశంలోనే అత్యధిక సంతానోత్పత్తి రేటు ఉండి, జనాభా నియంత్రణ లేని ఆ ఊరి జనాలకి మనోడు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పాఠాలు చెప్పాల్సి వస్తుంది. ఒకవైపు జాబ్ టెన్షన్స్, లవ్ ప్రాబ్లమ్స్, ఇంకోవైపు ఊరి జనాల అపార్థాల మధ్య సుబ్బు పడే ఇబ్బందులు, క్రియేట్ చేసే కామెడీతో ఈ ట్రైలర్ నవ్వులు పూయించింది. మిథిలా పాల్కర్ ఒక క్రేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటి అవ్వాలని కలలుకనే పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు కామెడీ కింగ్ బ్రహ్మానందం, వర్సటైల్ యాక్టర్ మురళీ శర్మ, గెటప్ శ్రీను, జీవన్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి ఈ సిరీస్‌ను నిర్మించారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ సంయుక్తంగా దీనికి కథను అందించారు. ఈ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్ జులై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

# ప్రొడ్యూసర్‌కి 15 కండిషన్స్ పెట్టిన యంగ్ బ్యూటీ..

టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి హీరోగా, సోషల్ మీడియా ఫోక్ సెన్సేషన్ నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న సరికొత్త చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయింది. ఈ సినిమాకు 'ఇడుపు కాయితం' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ పూజా కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ గెస్ట్‌గా వచ్చి టైటిల్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. అయితే, ఈ ఈవెంట్‌లో ప్రొడ్యూసర్ బన్నీ వాస్ తన హీరోయిన్ నాగదుర్గ గురించి చెప్పిన ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా ఓపెనింగ్స్ వేడుకలో నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ హీరోయిన్ నాగదుర్గ గురించి ఒక క్రేజీ సీక్రెట్ బయటపెట్టారు. "ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయాలని నాగదుర్గను సంప్రదించగానే, ఆమె ఓకే చెప్పడానికి ముందు నాకు ఏకంగా 15 కండిషన్స్ పెట్టింది. ఇక ఆ రూల్స్ అన్నీ విన్నాక నేనేం అప్సెట్ అవ్వలేదు, పైగా చాలా ఆనందించాను. ఒక తెలుగు అమ్మాయి తన కెరీర్ విషయంలో, చేసే క్యారెక్టర్ విషయంలో ఎంత క్లారిటీగా ఉందో చూసి నాకు ముచ్చటేసింది. అప్పుడే నాకు అర్థమైంది.. నేను మాట్లాడుతోంది పక్కా క్లారిటీ ఉన్న ఒక తెలుగు అమ్మాయితో అని" అంటూ బన్నీ వాస్ సర్ప్రైజ్ అయ్యారు.యూట్యూబ్, సోషల్ మీడియాలో తెలంగాణ జానపద పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ ద్వారా నాగదుర్గకు ఎంత క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఆమె చేసిన ప్రతి ఫోక్ సాంగ్ మిలియన్ల కొద్దీ వ్యూస్ రాబట్టి రికార్డులు సృష్టించింది. ఇక డాన్స్‌లో ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను షేక్ చేసిన నాగదుర్గ, ఇప్పుడు 'ఇడుపు కాయితం' సినిమాతో సిల్వర్ స్క్రీన్ మీద కూడా దూసుకుపోవాలని రెడీ అవుతోంది.





# కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

## ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ. 55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది.




# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్

అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు.

# నా బాడీ నాష్టం అంటే..వాడి కళ్లు వాడి ఇష్టం

## స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత




ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com